సోమవారం
23-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 272
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

యుద్ధ రంగంలో అమెరికా

ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఇరాన్‌పై దాడి

- మూడు అణు కేంద్రాలపై బాంబుల వర్షం
- ఫర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ స్థావరాలకు నష్టం
- లక్ష్మణరేఖ దాటిన అమెరికా
- తాడో పేడో తేల్చుకుంటాం: ఇరాన్

టెల్అవీవ్/టెహ్రాన్: ఇరాన్ మీద ఇజ్రాయిల్ ప్రకటించిన యుద్ధంలో అమెరికా ప్రత్యక్షంగా చేరిపోయింది. శనివారం-ఆదివారం మధ్య రాత్రి అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్‌లోని మూడు అణు స్థావరాలను ధ్వంసం చేశాయి. ఇరాన్ అణ్వస్త్రాలు తయారు చేస్తోందన్న తమ వాదనను సమర్థించుకోవడానికి అమెరికా యుద్ధ రంగంలో చేరిపోయింది. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య జరుగుతున్న ఘర్షణలో తమ పాత్ర ఏమిటో తేల్చుకోవడానికి పదిహేను రోజులు పడుతుందన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్... ఆ గడువు తీరకముందే ఇరాన్‌పై విరుచుకుపడ్డారు. ఫర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై అమెరికా యుద్ధ విమానాలు భారీ స్థాయిలో బాంబుల వర్షం కురిపించాయి.

ట్రంప్ పొగడ్తలు

ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసిన అమెరికా వైమానిక దళంపై ట్రంప్ పొగడ్తల వర్షం కురిపించడంతో పాటు 'ఇది అమెరికాకే కాక మొత్తం ప్రపంచానికే చరిత్రాత్మకమైంది. ఇక ఇరాన్ యుద్ధ విరమణకు సిద్ధం కావాలి' అని గొప్పలు చెప్పుకున్నారు. అంటే యుద్ధానికి కారణం ఇరానేనని ఆయన ఆంతర్యం. అసలు యుద్ధం ప్రారంభించింది ఇజ్రాయిల్ అయినప్పుడు ఇరాన్‌ను యుద్ధం నిలిపివేయాలని కోరడం విచిత్రాల్లోకెల్లా విచిత్రం. ట్రంప్ ఇజ్రాయిల్ పక్షాన యుద్ధానికి దిగారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ట్రంప్, తాను ఎప్పుడూ బల ప్రదర్శన ద్వారానే శాంతి నెలకొంటుందని చెప్తూ ఉన్నాం అని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ వ్యాఖ్యానించారు. అయితే అమెరికాను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధమైంది. ఇజ్రాయిల్‌పై క్షిపణి దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఫర్డో మీద అమెరికా 30,000 పౌండ్ల బరువున్న బంకర్ విధ్వంసక బాంబులను ప్రయోగించింది. నతాంజ్, ఇస్ఫహాన్ మీద క్షిపణులతో దాడి చేసింది. ఇరాన్ వైమానిక శక్తిని, భారీ విధ్వంసకర క్షిపణులను నాశనం చేయడంతో పాటు ఇరాన్ అణ్వస్త్రాలు తయారు చేసే అవకాశం లేకుండా చేయడం అమెరికా లక్ష్యం. నిజానికి ఇరాన్ యురేనియం శుద్ధి చేసింది తప్ప అణ్వస్త్రాలు తయారు చేసిన దాఖలాలు లేవు. ఇజ్రాయిల్, అమెరికా కత్తిగట్టినట్టు ప్రవర్తించి తమ కిరాతక లక్షణాన్ని రుజువు చేసుకున్నాయి.ఇరాన్ యురేనియం శుద్ధి కేంద్రాలను కొండల చాటున, భూమిలో వంద

- మిగతా 2 లో

హర్మూజ్ జలసంధి

మూసివేత!

ఇరాన్ పార్లమెంటు ఆమోదం

2లో

ప్రపంచ దేశాల

ఖండన

దౌత్యం, చర్చలతోనే పరిష్కారాలు సాధ్యమని హితవు

పశ్చిమాసియా రణరంగంగా మారిపోవడంపై ప్రపంచ దేశాధినేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఇరాన్‌పై అమెరికా తాజా దాడులను తీవ్రంగా వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

2లో

అప్పుడే అయిపోలేదు...

ఇరాన్‌లో ఇంకా చాలా లక్ష్యాలున్నాయ్: ట్రంప్

2లో

గల్ఫ్‌లో హై అలర్ట్

దుబాయ్: ఇరాన్‌పై అమెరికా దాడులతో గల్ఫ్ అప్రమత్తమైంది. పశ్చిమాసియాలో యుద్ధం విస్తరించేందుకు అవకాశం ఉండటంతో హై అలర్ట్ ప్రకటించింది. ముందు జాగ్రత్త చర్యల్లో నిమగ్నమైంది. అమెరికా స్థావరాలకు నిలయాలుగా ఉన్న బహ్రెయిన్, కువైట్‌లో ఆదివారం ఉద్రిక్తలను ఎదుర్కొనే ఏర్పాట్లు మొదలయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులను ఇంటి నుంచి పని చేయాలని బహ్రెయిన్ ఆదేశాలిచ్చింది. తదుపరి ఆదేశాల వరకు 70 మంది ఉద్యోగులు ఇంటి నుంచే పని చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రాదేశిక భద్రత దృష్ట్యా ఈ మేరకు నిర్ణయించినట్లు 'ఎక్స్'లో బహ్రెయిన్ అంతర్గత శాఖ వెల్లడించింది. ప్రధాన రహదారులపైకి వెళ్లొద్దని డ్రైవర్లకు సూచించింది.

మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదు

రాయ్‌పూర్: మావోయిస్టులతో ఎలాంటి చర్చలు జరిపేదే లేదని హెూం మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ఆయుధాలు విడిచి జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. వర్షాకాలంలో కూడా నక్సల్స్ ఏరివేత కొనసాగుతుందని, మార్చి 2026లోగా నక్సల్స్‌ను పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యం అన్నారు. ఆయుధాలు వదిలిన వారిని తాము హృదయపూర్వకంగా స్వాగతిస్తామని తెలిపారు. ఇక్కడి విష్ణు దేవ్ సాయి ప్రభుత్వం నక్సల్స్ ఏరివేతలో అతిపెద్ద విజయం సాధించారని అమిత్ షా ప్రశంసించారు.

నవీన్ పట్నాయక్‌కు శస్త్రచికిత్స

భువనేశ్వర్: ఒడిశా మాజీ ముఖ్యమంత్రి బీజేడీ పార్టీ అధ్యక్షుడు నవీన్‌పట్నాయక్‌కు ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు వైద్యులు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని తెలిపారు. ఈ మేరకు ముంబైలోని కోకిలాబెన్ దీరుభాయ్ అంబాని ఆసుపత్రి సీఈఓ, ఎక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్‌సంతోష్ శెట్టి ఓ ప్రకటన విడుదల చేశారు. " ఆపరేషన్ విజయవంతమైంది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు" అని పట్నాయక్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్న డాక్టర్ రమాకాంత్ పాండా అన్నారు.

ఇదీ లోకం!

ముందు..వారానికోసారి ఉన్న మా గ్రంథాలయం పిరియడ్ అమలు చేయండంకుల్!

సామ్రాజ్యవాద దురాక్రమణను

వ్యతిరేకించాలి

ఐదు వామపక్షాల ఐక్య పిలుపు: ఇరాన్‌పై అమెరికా దాడులకు ఖండన

న్యూఢిల్లీ: సామ్రాజ్యవాద దురాక్రమణను వ్యతిరేకించాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. ఇరాన్‌పై అమెరికా దాడులను తీవ్రంగా ఖండించాయి. అమెరికా-ఇజ్రాయిల్ అనుకూల వైఖరిని విడనాడి, యుద్ధోన్మాదాన్ని ఆక్షేపించాలని భారత ప్రభుత్వానికి సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శులు డి.రాజా, ఎంఏ బేబి, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజన్ ఆదివారం సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్‌తో జతకట్టి ఇరాన్‌పై అమెరికా విరుచుకుపడటం, మూడు అణు కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమే కాకుండా పశ్చిమాసియా అస్థిరతకు దారితీసేవిగా అమెరికా సైనిక చర్యలు ఉన్నాయని దుయ్యబట్టారు. తాజా పరిణామాలు ఆర్థికపరంగా సవాళ్లకు దారితీయొచ్చని హెచ్చరించారు. అణ్వస్త్రాలు తయారు చేసేందుకు వీలు లేకుండా ఇరాన్‌పై దాడులు చేసినట్లు

- మిగతా 2 లో

'ఉమ్మడి కరీంనగర్'

సమగ్రాభివృద్ధికి కృషి

- ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండాలి
- ఆయిల్ పామ్ సాగుపై మరింత శ్రద్ధ
- మూడున్నరేళ్లలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- విద్య, వైద్య, వ్యవసాయానికి ప్రాధాన్యం
- సమీక్షా సమావేశంలో మంత్రులు తుమ్మల, దుద్దిళ్ల, పొన్నం

2లో

నాన్‌ట్యాక్స్ రెవెన్యూపై దృష్టి

- రూ.33,600 కోట్లతో సంక్షేమ పథకాలు
- ప్రాధాన్యతాక్రమంలో ప్రాజెక్టులు పూర్తి
- అన్ని శాఖలకూ సమానంగా బడ్జెట్
- సబ్ కమిటీ చైర్మన్ భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: నాన్‌ట్యాక్స్ రెవెన్యూ రాబడులను పెంచడంపై అధికారులు దృష్టి సారించాలని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కేపిటల్ సబ్ కమిటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. అంబేద్కర్ సచివాలయంలో ఆదివారం సబ్ కమిటీ సభ్యులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి భట్టి సమీక్షా సమావేశం నిర్వహించారు. నాన్ ట్యాక్స్ రెవెన్యూతో పాటుగా కేంద్ర నిధులను కూడా సాధించుకోవాలని అన్నారు. రూ. 33,600 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. అధికారంలోకి వచ్చిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఓఆర్ఆర్, ఎక్సైజ్ ఆదాయాలు రాకుండా పోయాయన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్,

- మిగతా 2 లో

సిట్ దూకుడు

- మద్యం కేసు దర్యాప్తు ముమ్మరం
- చెవిరెడ్డి అరెస్టు వెనుక పరిణామాలు
- అధికారులపై గన్‌మాన్ లేఖ ప్రకంపనలు
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలు

2లో

సజ్జల, అంబటిపై కేసులు

2లో

అత్యంత సురక్షిత బంకర్‌లోకి ఖామేనీ

తెహ్రాన్: ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య భీకర పోరు పదో రోజుకు చేరుకుంది. అమెరికా రంగ ప్రవేశంతో పరిస్థితి మరింత ఉధృతంగా మారింది. ఇజ్రాయిల్-అమెరికా కలిసి దాడి చేస్తే ఇరాన్ ఒంటరిగా దీటుగా ఎదుర్కొంటోంది. తాజా పరిణామాల క్రమంలో ఇరాన్ అధినేత ఆయాతుల్లా అలీ ఖామేనీ అత్యంత సురక్షిత బంకర్‌లోకి వెళ్లిపోయారు. శనివారం దాడుల్లో కీలక కమాండర్లు ప్రాణాలు కోల్పోవడం, కీలక అణు కేంద్రాలపై అమెరికా ఆదివారం దాడులకు తెగబడటంతో క్రమంలో ఖామేనీ భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది. సిగ్నళ్లకు సైతం అందని ప్రాంతంలో అత్యంత సురక్షిత బంకర్‌లో ఆయన ఆశ్రయం పొందినట్లు సమాచారం. ఖామేనీకి అత్యంత సన్నిహితులైన ముగ్గురికి మాత్రమే ఆయనతో నేరుగా మాట్లాడేందుకు అవకాశం ఉన్నట్లు తెలిసింది. వారి ద్వారానే ఆయన తదుపరి ఆదేశాలను జారీచేస్తున్నట్లు సమాచారం. కాగా, అమెరికా బీ-2 స్పిరిట్ బాంబర్లతో ఇరాన్‌పై విరుచుకుపడింది. ఫోర్డో, నతాంజ్, ఇస్ఫాహన్ అణుకేంద్రాలపై భారీ దాడులకు పాల్పడింది. ఈమేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇజ్రాయిల్ సైన్యంతో కలిసి దాడి చేసినట్లు వెల్లడించారు. దాడుల తర్వాత తమ విమానాలు సురక్షితంగా తిరిగి వచ్చినట్లు తెలిపారు.

ఖామేనీ వారసుడిగా చోటు దక్కని ముజ్తబా!

ఆ స్థానానికి ముగ్గురి పేర్లు ప్రతిపాదించిన అధినేత

న్యూయార్క్: ఇరాన్‌పై ఇజ్రాయిల్-అమెరికా దాడులతో పరిస్థితి మరింత జటిలంగా మారిన క్రమంలో తన వారసులుగా ముగ్గురిని ఇరాన్ అధినేత ఆయాతుల్లా అలీ ఖామేనీ (85) ఎంపిక చేసినట్లు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. అయితే ఆ ముగ్గురిలో ఖామేని పెద్ద కుమారుడు ముజ్తబా ఖామేనీ పేరు లేదని తెలిపింది. ఖామేనీ బంకర్‌లో ఆశ్రయం పొందుతూ అక్కడ నుంచే తదుపరి ఆదేశిస్తున్న క్రమంలో ఈమేరకు వార్తా కథనం వెలువడటం చర్చకు దారితీసింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ఫోర్స్ (ఐఆర్‌జీసీ)లో కీలక పదవుల్లో నియమించాల్సిన కమాండర్ల పేర్లను కూడా ఆయన ప్రకటించినట్లు వెల్లడించింది. ఖామేనీకి ప్రమాదం జరిగితే ఆయన తర్వాత ఇరాన్ పగ్గాలు చేపట్టేది ఎవరన్న దానిపై ప్రస్తుతం సాగుతున్న యుద్ధం క్రమంలో పెద్దఎత్తున చర్చ జరుగుతున్నది. ఈ నియామకానికి కొన్ని నెలలు పట్టవచ్చు. ఖామేనీ ప్రతిపాదిత పేర్లను ఇరాన్‌లోని మతాధికారులు పరిశీలించి, షార్ట్‌లిస్ట్ చేస్తారు. అయితే ఖామేనీ తనకు వారసుడిగా కుమారుడు ముజ్తబా పేరును ప్రతిపాదించకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఖామేనీ తన నిర్ణయాన్ని ఇప్పటికే ఇరాన్ అసెంబ్లీ నిపుణులు, సీనియర్ మతాధికారులకు తెలియజేశారు. అత్యవసరంగా పదవీ బాధ్యతలను బదిలీ చేయాల్సిన పరిస్థితికి సిద్ధంగా ఉండాలని, తాను ప్రతిపాదించిన ముగ్గురిలో నుంచి ఒకరిని ఎంపిక చేయాలని కోరారు. అయితే ఆ ముగ్గురు ఎవరన్నది బహిర్గతం చేయలేదు. ఆయాతుల్లా అలీ ఖామేనీ తర్వాత ఇరాన్ పగ్గాలను ఆయన కుమారుడు చేపడతారన్న వార్తలను ఇరాన్ ఖండించింది. ఇరాన్ అధినేతకు సర్వాధికారాలు ఉంటాయి. సాయుధ దళాల కమాండర్ ఇన్ చీఫ్‌గా, న్యాయ వ్యవస్థ- శాసనసభ- కార్యనిర్వాహక శాఖ అధిపతిగా అపారమైన అధికారాలను కలిగివుంటారు కాబట్టి ఈ పదవి కోసం అర్హుడైన వ్యక్తి ఆచితూచి ఎంపిక చేస్తారు. ఈ నియామకానికి సంబంధించిన ప్రక్రియ నెలల తరబడి సాగుతుంది.

హర్మూజ్ జలసంధి' మూసివేత!

తెహ్రాన్ : ఇరాన్ అనుకున్నంత పని చేసింది. తమ దేశంలోని అణు స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయిల్, అమెరికా బాంబుల వర్షం కురిపించడంతో ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హర్మూజ్ జలసంధిని మూసివేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇరాన్ పార్లమెంటు ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకోవడంతో పాటు ప్రపంచ దేశాల మద్దతును కూడగట్టేందుకే ఇరాన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20 శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం-ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్ నుంచి ఎగుమతి అవుతోంది. అలాగే లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది. భారత్ తన అవసరాల్లో 90 శాతం ముడి చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అందులో 40 శాతం హర్మూజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. దీంతో భారతదేశం తన 74 రోజుల చమురు నిల్వలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువపైనా ప్రభావం చూపిస్తుంది.

అమెరికాతో దౌత్యానికి అవకాశం లేదు: ఇరాన్

ఇస్తాంబుల్: తమ దేశంపై భీకర దాడులకు పాల్పడున్న అమెరికాతో చర్చలకు ఏ మాత్రం అవకాశం లేదని ఇరాన్ తేల్చిచెప్పింది. ఇరాన్‌లోని మూడు అణు స్థావరాలపై అమెరికా దాడిని ఇరాన్ తీవ్రంగా పరిగణించింది. అమెరికాతో దౌత్యానికి అవకాశం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. అమెరికా సైనిక దుశ్చర్యతో ఐరాస చట్టాలను అతిక్రమించిందని, దౌత్యానికి ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెన్నుపోటు పొడిచారని వ్యాఖ్యానించారు. అరాగ్చీ ఆదివారం ఇస్తాంబుల్‌లో విలేకరులతో మాట్లాడుతూ అణు కేంద్రాలపై అమెరికా దాడి ద్వారా రెడ్‌లైన్ దాటిన అమెరికాతో చర్చలకు ఎంత మాత్రం అవకాశం లేదని స్పష్టంచేశారు. దౌత్యానికి ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉంటాయి కానీ ప్రస్తుతం అది సాధ్యం కాదన్నారు. అమెరికా మొదలు పెట్టింది... ఇరాన్ ముగుస్తుందని వ్యాఖ్యానించారు. ఆత్మరక్షణ హక్కు ఆధారంగా తమ స్పందన ఉంటుందని చెప్పారు. తదుపరి చర్యల పూర్తి బాధ్యత అమెరికాదేనన్నారు. అమెరికా దాడితో అణు కేంద్రాలకు ఏ స్థాయిలో నష్టం జరిగిందని విలేకరి ప్రశ్నకు ప్రస్తుతానికి చెప్పలేనని ఆయన అన్నారు. ఐరాస చార్టర్, అంతర్జాతీయ చట్టాలంటే తమకు గౌరవం లేదని ఈ దుశ్చర్యతో అమెరికా నిరూపించుకుందని వ్యాఖ్యానించారు.

నేడు రష్యాకు అరాగ్చీ

అమెరికాపై ఏ స్థాయిలో ప్రతిఘటన ఉండబోతోందో చెప్పనని, తాజా పరిణామాల క్రమంలో సోమవారం మాస్కో వెళుతున్నానని అరాగ్చీ చెప్పారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలుస్తానన్నారు. రష్యా తమకు మిత్రదేశమని చెప్పారు. తాజా పరిస్థితికి పుతిన్ ఏదో ఒక పరిష్కారాన్ని తప్పక సూచిస్తారన్న విశ్వాసాన్ని అరాగ్చీ వ్యక్తంచేశారు.

యుద్ధ రంగంలో అమెరికా

(మొదటిపేజీ తరువాయి)

మీటర్ల లోతున అణు కేంద్రాలను ఏర్పాటు చేసుకుంది. వీటిని ధ్వంసం చేయగల సామర్థ్యం ఇజ్రాయిల్‌కు లేదు కనక అమెరికా నేరుగా యుద్ధ రంగంలోకి దిగింది.

అణు ధార్మికశక్తి వెలువడిన దాఖలాలు లేవు

అణు స్థావరాలపై అమెరికా దాడులతో ఆ ప్రాంతాలలో అణు ధార్మికశక్తి వెలువడిన దాఖలాలు లేవు. అంటే ఇరాన్ అణ్వస్త్రాలు తయారు చేస్తోందన్న ప్రచారం ఎంత అసత్యమైందో రుజువు అవుతోంది. అమెరికా దాడి వల్ల ఇరాన్‌కు ఎంత నష్టం జరిగిందో ఇజ్రాయిల్ అంచనా వేస్తోంది. ఇజ్రాయిల్‌తో సమన్వయంతోనే అమెరికా బాంబుల దాడి చేసింది. ఈ లోగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలుసుకోవడానికి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ... మాస్కో పయనమయ్యారు. రష్యాతో తమకు వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయని, ఎప్పుడూ పరస్పరం సంప్రదించుకుంటూనే ఉంటామని చెప్పారు. అమెరికా ప్రత్యక్ష దాడికి దిగిన తరవాత ఇక దౌత్య ప్రయత్నాలకు ఆస్కారమే లేదని ఆయన చెప్పారు. అత్యంత ప్రమాదకరమైన బాంబు దాడులకు, ఆ తరవాత జరిగే పరిణామాలకు పూర్తి బాధ్యత అమెరికాదేనని కూడా అన్నారు. దౌత్య పరిష్కారానికి ఎప్పుడు తలుపులు తెరిచి ఉంచాలన్న మాట నిజమే అయినప్పటికీ అమెరికా ప్రత్యక్ష దాడి వల్ల దీనికి అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. అమెరికా దాటని లక్ష్మణ రేఖ ఏదీ లేదన్నారు.

బ్రిటన్‌కు ముందే తెలుసు

ఇరాన్‌పై దాడులు చేయనున్నట్లు బ్రిటన్‌కు అమెరికా ముందుగానే సమాచారం అందించింది. రిపబ్లికన్ పార్టీకి కూడా విషయం తెలియజేశారట. డెమొక్రాటిక్ పార్టీకి మాత్రం బాంబులు వేసేదాకా తెలియదు. ఇరాన్ తాజా దాడుల వల్ల తమ దేశానికి చెందిన 80 మంది గాయపడ్డారని ఇజ్రాయిల్ పేర్కొంది. వీరిలో దాదాపు 70 మందికి స్వల్ప గయాలయ్యాయి. ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేయగలిగామని, తమ యుద్ధ విమానాలు ఇరాన్ గగనతలం నుంచి బయటకు వచ్చేశాయని ట్రంప్ తెలిపారు. అమెరికా తమ అణు స్థావరాల మీద దాడి చేసిన మాట నిజమే కానీ తమ యురేనియం శుద్ధి పనులు ఆపే ప్రసక్తి లేదని ఇరాన్ అణు ఇంధన సంస్థ స్పష్టం చేసింది. శత్రువుల దుష్ట పన్నాగాలు ఎలా ఉన్నప్పటికీ వేలాది మంది విప్లవకారుల, లక్ష్య శుద్ధి ఉన్న శాస్త్రవేత్తల సహకారంతో అణు కార్యక్రమాలు కొనసాగిస్తామని వెల్లడించింది.

యుద్ధ నౌకలపై దాడి చేస్తాం: హౌతీల హెచ్చరిక

ఇరాన్ అణు స్థావరాల మీద బాంబులు వేసినందుకు అమెరికా నౌకలపై దాడి చేస్తామని యెమెన్‌లోని హౌతీలు ప్రకటించారు. ఎర్ర సముద్రంలోని అమెరికా యుద్ధ నౌకల మీద దాడి చేస్తామని వారు హెచ్చరించారు.

ఇరాన్ దాడిలో టెల్‌అవీవ్, హైఫాకు నష్టం

ఇరాన్ ప్రతీకార దాడిలో ఇజ్రాయిల్ రాజధాని టెల్ అవీవ్, హైఫా నగరాలు బాగా నష్టపోయాయి. పశ్చిమ ఇరాన్ మీద దాడులు కొనసాగిస్తున్నామని ఇజ్రాయిల్ ప్రకటించింది. ఇరాన్‌కు చెందిన రెండు ఎఫ్-5 యుద్ధ విమానాల మీద దాడి చేశామని ఇజ్రాయిల్ చెప్తోంది. ఇజ్రాయిల్ గత 13 రోజులుగా జరుపుతున్న దాడుల్లో ఇరాన్‌లో 430 మంది మరణించారని, దాదాపు 3,500 మంది గాయపడ్డారు. ఇజ్రాయిల్‌లో 24 మంది మరణించారని, 1,200 మంది గాయపడ్డారని ఇజ్రాయిల్ ప్రకటించింది.

1979 తర్వాత తొలిసారి అమెరికా దాడి

1979లో ఇరాన్‌లో అప్పటి రాజు షా మహమ్మద్ రెజా పెహ్లవీని గద్దెదించడానికి జరిగిన విప్లవం తరవాత ఇరాన్ భూభాగంలోకి వెళ్లి అమెరికా దాడి చేయడం ఇదే మొదటిసారి. తాజా దాడుల వల్ల ఇజ్రాయిల్‌కు ముప్పు నివారించగలిగామని ట్రంప్ అన్నారు. శాంతి నెలకొనాలి... లేకపోతే ఇరాన్‌కు మిగిలేది తీరని విషాదమేనని హెచ్చరించారు. తమ దాడుల వల్ల శాశ్వత ప్రభావం ఉంటుందని ట్రంప్ అన్నారు. ట్రంప్ గంభీరమైన యుద్ధోన్మాద ప్రకటనలను బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమర్థించారు. ఇరాన్‌ను ఎట్టి పరిస్థితిలోనూ అణ్వస్త్రాలు తయారు చేయనివ్వబోమన్నారు. పశ్చిమాసియా సుస్థిరంగా ఉండటమే ధ్యేయంగా స్టార్మర్ చెప్పారు.

ప్రపంచ దేశాల ఖండన

బీజింగ్/దుబాయ్: పశ్చిమాసియా రణరంగంగా మారిపోవడంపై ప్రపంచ దేశాధినేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఇరాన్‌పై అమెరికా తాజా దాడులను తీవ్రంగా వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. అణు కేంద్రాలపై దాడులు తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని హెచ్చరించారు. సమస్య ఏదైనా దౌత్యం-చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని, సైనిక చర్యలతో సమాధానం లభించదని సూచించారు. ప్రాదేశిక అనిశ్చితిని మరింత పెంచవద్దని హితవు పలికారు. ఇరాన్‌పై ప్రత్యక్ష దాడితో అంతర్జాతీయ చట్టాన్ని అమెరికా అతిక్రమించిందని దుయ్యబట్టారు. శాంతి భద్రతలకు ముప్పు కలిగిస్తూ పశ్చిమాసియా సుస్థిరతకు మరింత విఘాతం కలిగించే చర్యలు వద్దని సూచించారు. అమెరికా దాడి చేసిన అణు స్థావరాలు ఐరాస అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) పరిరక్షణలోనివిగా చైనా తెలిపింది. ఐక్యరాజ్యసమితి ఆదేశాలు, అంతర్జాతీయ చట్టాన్ని అతిక్రమిస్తూ పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింతగా పెంచుతున్న అమెరికా సైనిక చర్యలు ఆక్షేపణీయమని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. ఘర్షణ పడుతున్న దేశాలు ప్రత్యేకించి ఇజ్రాయిల్ తక్షణమే కాల్పుల విరమణకు ముందుకు రావాలని పిలుపునిచ్చింది. పౌరుల భద్రతకు హామీనివ్వాలని, చర్చలు, దౌత్య మార్గాల్లో పరిష్కారానికి కృషిచేయాలని చైనా విదేశాంగ శాఖ సూచించింది. పశ్చిమాసియాలో యుద్ధం విస్తరించే పరిస్థితిపై అరబ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. వాషింగ్టన్, తెహ్రాన్ మధ్య అణు చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న ఒమన్... ఇరాన్‌పై అమెరికా దాడిని తీవ్రంగా ఖండించింది. అత్యంత సున్నిత పరిస్థితల్లో రాజకీయ పరిష్కారం కోసం ప్రయత్నాలను రెట్టింపు చేయాలని అంతర్జాతీయ సమాజానికి సౌదీ అరేబియా పిలుపునిచ్చింది. సంయమనం పాటించాలని, ఇరాన్ సార్వభౌమత్వానికి విఘాతం కలిగించవద్దని మిత్రదేశం అమెరికాకు సూచించింది. ప్రస్తుత పరిస్థితులు ప్రాదేశిక, అంతర్జాతీయ స్థాయిలో విపత్తుకర పరిణామాలకు దారితీయొచ్చని ఖతార్ విదేశాంగ శాఖ హెచ్చరించింది. విజ్ఞతతో వ్యవహరించాలని, సంయమనం పాటించాలని కోరింది. యుద్ధం మరింత విస్తరించొద్దని ఈజిప్టు సూచించింది. దౌత్యపరంగా, రాజకీయపరంగా పరిష్కారం కోసం ప్రయత్నించాలని పేర్కొంది. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులతో యుద్ధం మరింత విస్తరించి అనిశ్చితికి దారితీసే ప్రమాదం ఉందని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ భయాందోళన వ్యక్తంచేశారు. ఈ సంఘర్షణ ప్రపంచ యుద్ధానికి దారితీయొచ్చని టర్కీ హెచ్చరించింది. తక్షణమే దాడులు ఆపాలని, బాధ్యతగా వహరించాలని పిలుపునిచ్చింది. ఈ సంక్షోభానికి చర్చలతోనే సమాధానం లభించగలదని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు వోన్ డెర్ లెయన్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాన్ని గౌరవించాలని, దౌత్య పద్ధతుల్లో పరిష్కారానికి యత్నించాలని అమెరికాకు సూచించారు. అమెరికా, ఇజ్రాయిల్‌తో తక్షణమే చర్చలు జరపాలని ఇరాన్‌కు జర్మనీ ఛాన్సలర్ మెర్జ్ సూచన చేశారు. యుద్ధాన్ని ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిదని జపాన్ ప్రధాని ఇషిబా అన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడులను రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ దిమిత్రి మెద్వదేవ్ ఖండించారు. ఆ దేశానికి అణ్వాయుధాలు సరఫరా చేసేందుకు చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడులను రష్యా వ్యతిరేకిస్తుండటం, ఆ దేశం అణ్వాయుధాలను కలిగి ఉన్న నేపథ్యంలో మెద్వదేవ్ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఉద్రిక్తతలు మరింత పెరిగితే పశ్చిమాసియాతోపాటు వెలుపలి ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని పాకిస్థాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఐరాస చార్టర్ నిబంధనల మేరకు సంక్షోభ పరిష్కారానికి దౌత్యమే మార్గమని సూచించింది. అమెరికా దాడులు అంతర్జాతీయ శాంతి, భద్రతలకు ముప్పని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ చట్ట ఉల్లంఘన, పశ్చిమాసియా యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేయడం ఆక్షేపణీయమని లాటిన్ అమెరికా దేశాలు పేర్కొన్నాయి, చర్చల ద్వారా పరిష్కారానికి కృషిచేయాలని వెనిజులా, చిలీ, కొలంబియా పిలుపునిచ్చాయి. ఇరాన్ దగ్గర అణ్వస్త్రం ఎప్పటికీ ఉండకూడదని, సంక్షోభం అంతం కోసం చర్చలు జరపాలని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు.

ఐరాస భద్రతా మండలికి ఇరాక్ ఫిర్యాదు

అమెరికా తమ గగనతలాన్ని ఉల్లంఘించిందని ఐరాస భద్రతామండలికి ఇరాక్ ఫిర్యాదు చేసింది. పొరుగు దేశాల భద్రతను అమెరికా చర్యలు ప్రమాదంలో పడేస్తున్నాయని, తమ దేశాన్ని యుద్ధ భూమిగా మార్చేందుకు అనుమతించబోమని లెబనాన్, జోర్డాన్ పేర్కొన్నాయి. అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించే నిర్లక్ష్యపు చర్యను ఆక్షేపించాయి.

అప్పుడే అయిపోలేదు...

ఇరాన్‌లో ఇంకా చాలా లక్ష్యాలున్నాయ్: ట్రంప్

వాషింగ్టన్: అప్పుడే అయిపోలేదు... ఇరాన్‌లో ఇంకా చాలా లక్ష్యాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడి అనంతరం ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతులో కలిసి ఒక బృందంగా పని చేసినట్లు తెలిపారు. ఇరాన్ అణు సమృద్ధి వినాశనమే తమ లక్ష్యమని చెప్పారు. ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉంటే ప్రపంచంలోనే నంబర్ వన్ ఉగ్రదేశంగా మారుతుందని, అలాంటి ముప్పు ఉండరాదంటే అక్కడ అణ్వస్త్రాల తయారీకి ఏ మాత్రం అవకాశం లేకుండా చేయాలని, అందుకే అణు కేంద్రాలపై దాడి చేశామని చెప్పారు. 'నేను నెతన్యాహుకు కృతజ్ఞతతో పాటు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. బహుశ మాలా ముందెన్నడూ ఏ బృందం కూడా పనిచేసివుండకపోవచ్చు. ఇజ్రాయిల్‌కున్న పెద్ద ముప్పును తొలగించడం కోసం చాలా దూరం వెళ్లాం. ఇజ్రాయిల్ సైన్యం అద్భుతంగా పనిచేసింది' అని ట్రంప్ గొప్పలు పోయారు. ఇరాన్ శాంతి ఒప్పందానికి ముందుకు రావాలన్నారు. లేకపోతే భవిష్యత్‌లో ఎంత వరకు వెళతామో చెప్పలేమని, అదే జరిగితే ఇరాన్‌కు విపత్తుకర పరిస్థితులు తప్పబోవని ట్రంప్ హెచ్చరించారు. త్వరగా శాంతి ఒప్పందం జరగకపోతే తదుపరి మరింత కచ్చితత్వంతో, నైపుణ్యంతో, గతితో దాడులు జరుగుతాయన్నారు. ఇతర లక్ష్యాలను కేవలం నిమిషాల వ్యవధిలో ధ్వంసం చేయగలమని ట్రంప్ హెచ్చరికలు చేశారు.

'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్': రక్షణ మంత్రి

ఇరాన్‌లోని కీలక అణు కేంద్రాలే లక్ష్యంగా దాడులు జరిపినట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. దీనిని 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'గా పేర్కొంది. ఇరాన్‌లోని అణు కార్యక్రమానికి తీవ్ర విఘాతం కలిగిందని తెలిపింది. ఈ దాడులు చేసినప్పటికీ యుద్ధాన్ని కోరుకోవడం లేదని, అక్కడి ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదని పేర్కొంది. ఈ ఆపరేషన్ వివరాలను రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్ మీడియాకు వెల్లడించారు. ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్ అణు కార్యక్రమాన్ని తీవ్రంగా దెబ్బతీశామని, 14 బంకర్-బస్టర్ బాంబులతో దాడి చేశామని చెప్పారు. అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డేనియల్ కెయిన్ మాట్లాడుతూ 'బీ-2 బాంబర్లు 18 గంటల ప్రయాణం అనంతరం ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించాయి. 30 వేల పౌండ్ల బరువున్న 14 బాంబులతో అణు కేంద్రాలపై చేశాయి. ఇస్ఫహాన్‌పై తొమాహాక్ క్షిపణులను ప్రయోగించాం. ఏడు బీ2 బాంబర్లు సహా మొత్తం 125కు పైగా యుద్ధ, ఇంధన, నిఘా విమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ఫోర్డో, నతాంజ్‌లపై దాడులు అనంతరం ఇరాన్ గగనతలాన్ని వీడాయి. ఇరాన్ కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2.10 గంటలకు ఈ దాడులు జరిగాయి' అని వెల్లడించారు.

'ఉమ్మడి కరీంనగర్'

సమగ్రాభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ అన్నారు. తుమ్మల అధ్యక్షతన కరీంనగర్ కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో జిల్లా పరిధిలో వ్యవసాయ, విద్య, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖల పని తీరుపై ఆదివారం సమీక్షా సమావేశం జరిగింది. తొలుత వర్షా భావ పరిస్థితులు, క్రాప్ బుకింగ్, సాగు వివరాలు, విత్తనాలు, ఎరువుల లభ్యత, రైతు భరోసా, ఆయిల్ పామ్ సాగు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, బడి బాట, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను జిల్లాల వారీగా సంబంధిత కలెక్టర్‌లు వివరించారు. గత పాలకుల సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని మంత్రులు అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు. అవినీతికి ఆస్కారం ఇవ్వకూడదన్నారు. విత్తనాలు, ఎరువుల నిల్వలు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. ఆయిల్ పామ్ సాగు పై మరింత శ్రద్ధ వహించాలని అన్నారు. లక్ష్యాలకు మించి ఆయిల్ పామ్ విస్తరణ చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ బడులలో విద్యార్థుల నమోదు పెంచాలన్నారు. రాబోయే ఎన్నికల నాటికి నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలని, కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అవసరమైన బోధన శిక్షణ అందిస్తామన్నారు. క్యాష్ క్రాప్స్, హార్టికల్చర్ పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు కోయ శ్రీ హర్ష, సందీప్ కుమార్, సత్య ప్రసాద్, పామేలా సత్పతి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరెందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ హాజరయ్యారు.

నాన్‌ట్యాక్స్ రెవెన్యూపై దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ సహా వివిధ కొత్త పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. బడ్జెట్‌ని అన్ని శాఖలకు సమానంగా పంచాల్సిన అవసర ఉందన్నారు. ఖర్చు అంతరాలను తగ్గించి... అన్నింటిని ఒకే స్థాయిలోకి తీసుకురావాలని, రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాల్లో పెండింగ్‌లో ఉన్న మేజర్ ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. 'రాష్ట్ర అవసరాలు, ప్రాముఖ్యతల మేరకు బడ్జెట్ నిధులు ఖర్చు చేయాలి. రెవెన్యూ తీసుకువచ్చే శాఖలు, విభాగాలపై దృష్టి సారించాలి. పబ్లిక్ ఇంట్రెస్ట్, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాప్రభుత్వం ఆలోచనల మేరకు అందరూ పనిచేయాలి. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సంపూర్ణ స్థాయిలో ముందుకు వెళ్తుంది. రాబోయే పది రోజుల్లో రేషనలైజేషన్ పూర్తి చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలి' అని అధికారులకు భట్టి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సజ్జల, అంబటిపై కేసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబుపై కేసులు నమోదయ్యాయి. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో రాజధాని దళిత జేఏసీ నేత కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు సజ్జలపై పోలీసులు కేసు నమోదు చేశారు. జర్నలిస్ట్ కృష్ణంరాజు రాజధాని మహిళలపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలకు రాజధాని మహిళలు నిరసన వ్యక్తం చేశారు. నిరసన వ్యక్తం చేసిన వారు సంకరజాతి వారని సజ్జల చేసిన వ్యాఖ్యలపై శిరీష ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టును సజ్జల రామకృష్ణారెడ్డి ఆశ్రయించారు. సజ్జలకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు వీలు లేదని హైకోర్ట్‌లో శిరీష తరపున న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. వరుస వారీగా వైసీపీ నేతలపై కేసులు నమోదు కావడం చర్చానీయాంశమైంది.

సామ్రాజ్యవాద దురాక్రమణను వ్యతిరేకించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇజ్రాయిల్, అమెరికా సమర్థించుకోవడటాన్ని ఖండించారు. ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయని, వాటి తయారీకి వ్యూహాత్మక కసరత్తు జరుగుతున్నట్లు ఆధారాలు లేవని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రాసీ ఇటీవల వెల్లడించడాన్ని వామపక్ష నాయకులు గుర్తుచేశారు. ఇరాన్ అణ్వస్త్రాలు తయారు చేస్తున్నట్లు తమ వద్ద కచ్చితమైన సమాచారం లేదని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా తెలిపాయన్నారు. న్యూక్లియర్ నాన్-ప్రొలిఫిరేషన్ ట్రీటీ (ఎన్‌పీటీ)పై ఇరాన్ సంతకం చేసిందని గుర్తుచేశారు. ఈ వాస్తవాలను బేఖాతరు చేస్తూ ఇరాన్‌పై ఈనెల 12న దాడులకు ఇజ్రాయిల్ పాల్పడిందని, ఆ దేశానికి మద్దతుగా ఇప్పుడు అమెరికా ప్రత్యక్ష దాడులకు దిగడమంటే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెంచడమే అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా దాడులతో ఇరాన్ వినాశనం, పశ్చిమాసియాపై ఆధిపత్యం, అంతర్జాతీయ వనరుల సరఫరాపై పెత్తనమే వారి లక్ష్యమని స్పష్టమవుతోందని వామపక్ష నాయకుల పేర్కొన్నారు. ప్రపంచ చరిత్రలో అణ్వస్త్రాలు ప్రయోగించినది అమెరికా ఒక్కటేనని గుర్తుచేశారు. అంతర్జాతీయ శాంతి, సామరస్యతకు విఘాతం కలిగించడమే కాకుండా వినాశకర పరిణామాలకు దారితీస్తూ, పశ్చిమయాసియాపై చమురు, ఉద్యోగాల కోసం ఆధారపడే భారత్ వంటి దేశాల్లో సామాన్యుల జీవనోపాధికి విఘాతం కలిగించేలా అమెరికా చర్యలు ఉన్నాయని వామపక్ష నాయకులు వ్యాఖ్యానించారు. అమెరికా, ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధానాన్ని తక్షణమే విడనాడాలని, యుద్ధాన్ని ఆపే ప్రపంచ దేశాల ప్రయత్నాల్లో భాగం కావాలని కేంద్రప్రభుత్వానికి సూచించారు. అమెరికా దాడులను ఖండించేందుకు శాంతిప్రియులు ఏకం కావాలని, సామ్రాజ్యవాద దురాక్రమణ వ్యతిరేక ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు.

సిట్ దూకుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కేసులో సిట్ బృందం దర్యాప్తు వేగవంతం చేసింది. ఈ కేసులో 39 మంది నిందితులపై అభియోగాలు మోపగా, ఇప్పటివరకు తొమ్మిది మందిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఇటీవల వైసీపీకి చెందిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టుతో ఈ కేసు మరింత సంచలనంగా మారింది. చెవిరెడ్డికి గతంలో పనిచేసిన గన్‌మాన్‌తో బలవంతపు స్టేట్‌మెంట్లు తీసుకున్నారంటూ ఆయన సీఎం చంద్రబాబుకు, డీజీపీకి, రాష్ట్రపతికి లేఖలు రాయడం చర్చనీయాంశమైంది. ఈ కేసులో సిట్ అధికారుల బృందం ఆరోపణలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత ప్రభుత్వ హయాంలోని మద్యం అవకతవకలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం సీఐడీ నేతృత్వంలో ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేసింది. వైసీపీ కీలక నేతలు, మాజీ అధికారులు ఆరోపణలు ఎదుర్కోవడంతో ఇది రాజకీయంగాను సంచలన కలిగిస్తోంది. గతంలో టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయాలు అమిత్‌షాతో భేటీ అయి... మద్యం కుంభకోణాల వివరాల్ని అందజేసినట్లు ప్రచారం జరిగింది. ఈ సంఘటనల ఆధారంగా మద్యం లావాదేవీల వ్యవహారంపై చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది. ఈ కేసులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నిందితుడిగా చేరుస్తూ దాఖలు చేసిన మెమోలో కొత్తగా మరో ఆరుగురిని నిందితులుగా సిట్ చేర్చింది. వారిలో ఇప్పటికే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన సన్నిహితుడు వెంకటేశ్ నాయుడును అరెస్టు చేశారు. వారిద్దరికి జులై ఒకటో తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చెవిరెడ్డి తనయుడు.. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నవీన్ కృష్ణ, హరీశ్, బాలాజీ పేర్లను చేర్చడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారి కోసం సిట్ అధికారులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. బెంగుళూరు, హైదరాబాద్‌తోపాటు మూడు రాష్ట్రాల్లో నిందితుల కోసం సిట్ బృందాలు గాలిస్తున్నాయి. వారి ఆర్థిక లావాదేవీలు, సెల్‌ఫోన్ ట్రాకింగ్‌పై ఆరా తీస్తున్నారు. ఈ కేసు ఎఫ్ఐఆర్‌లో ఏ4గా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేరు నమోదైంది. సరిగ్గా భాస్కర్‌రెడ్డి అరెస్టుకు ముందు ఆయన దగ్గర పనిచేసిన గన్‌మాన్ మదన్ రెడ్డిని సిట్ విచారించింది. చెవిరెడ్డి అరెస్ట్‌కు ముందే ఆయన దగ్గర పనిచేసిన గన్‌మెన్ మదన్‌రెడ్డిని సిట్ విచారించింది. అదే రోజు సిట్ అధికారులపై మదన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారాయి. తనను బెదిరించడంతోపాటు దాడి చేసి స్టేట్‌మెంట్ రికార్డు చేశారని సిట్ అధికారులపై సీఎం, డీజీపీకి, రాష్ట్రపతికి ఆయన లేఖలు రాశారు.

యువత భాగస్వామ్యంతోనే

డ్రగ్స్ రహిత సమాజం సాధ్యం : ఎస్ఐ

విశాలాంధ్ర - కారేపల్లి : యువత భాగస్వామ్యంతోనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని కారేపల్లి ఎస్సై బైరు గోపి అన్నారు. ఆదివారం కారేపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని కారేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కారేపల్లి ఎస్ఐ బైరు గోపి మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం దేశం పైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు అలవర్చుకొని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందన్నారు.

దామెరవాయిలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : తాడ్వాయి మండలం దామెరవాయి గ్రామంలో కొత్తూరు రోహిత్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన, సీజనల్ వ్యాధుల నివారణ గురించి, జనరల్ హెల్త్ చెకప్, మందుల పంపిణీని చేపట్టడం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో దామెరవాయి గ్రామ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామ ప్రజలు దాదాపు 300 మంది ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాలు పంచుకునీ, వైద్యులు, వైద్యనిపుణులు వివిధ రకాల వైద్య పరీక్షలతో పాటు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు, వాటికీ తగిన ఆరోగ్య చిట్కాలు, సలహాలు, సూచనలను ప్రజలకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేష్ కుమార్, డాక్టర్. రాజీవ్, డా. శ్రీనాథ్, డా. ఇస్సాక్, డా. ప్రవీణ్, డా. వెంకటేష్, డా. నవదీప్, డా. లోకేష్, డా. హర్షవర్ధన్, కేఎంసీ ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి ముందుండి అన్ని విధాలుగా సహకారాన్ని అందించిన కార్తీక్‌లను వైద్య అధికారులు, గ్రామ ప్రజలు అభినందిచారు. ఈ సందర్భంగా వైద్య బృందం గ్రామ ప్రజాప్రతినిధులకు, స్థానిక ఆరోగ్య సిబ్బందికి, గ్రామ ప్రజలకు, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేసారు.

ఖాతాల్లో రైతు భరోసా జమతో ఆనందం



విశాలాంధ్ర - చర్ల : కాంగ్రెస్ ప్రభుత్వం మాటిచ్చిన ప్రకారం రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండారు రామకృష్ణ అన్నారు. గత వారం రోజులుగా రైతుల ఖాతాలోకి జమ అవుతున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ ప్రారంభ సమయంలో రైతుభరోసా నగదు రావడం పట్ల రైతులు చాలా ఆనందంగా ఉండాలని తెలిపారు. సరైన సమయంలో రైతు భరోసా వచ్చిందన్నారు. రైతులకు విత్తనాలు, దుక్కులకు రైతు భరోసా ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 8 వేల కోట్లను రైతు భరోసా కింద అందజేసినట్లు వివరించారు. భవిష్యత్తులో కూడా రైతాంగం పట్ల తమ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. గత తమ కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో రైతులకు సబ్సిడీలు అందించమన్నారు. కానీ కెసిఆర్ ప్రభుత్వం వచ్చాక రైతు సబ్సిడీని పూర్తి నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తరువాతే సియం రేవంత్ రెడ్డి సబ్సిడీలకోసం ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యాచరణ

విశాలాంధ్ర - ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా కార్యాచరణ రూపొందించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. పాలక వర్గాలు ప్రజలను విస్మరించి -పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ఖమ్మం త్రీటౌన్ ఏరియా ఆరవ మహాసభ ఆదివారం జెట్టి రంగారావు ప్రాంగణం (గోల్డ్ కాంప్లెక్స్ గాంధీచౌక్)లో భూక్యా రవీందర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సురేష్ -మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పట్టణీకరణ పెరిగిందని ముఖ్యంగా ఖమ్మం నగర జనాభా గణనీయంగా పెరిగి ఐదు లక్షలకు చేరుకుందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన జరగడం లేదన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు జీవనోపాధి కోసం ఖమ్మం నగరానికి వలస వచ్చారని వలస వచ్చిన వారికి ఉపాధి కల్పనలో సైతం ప్రభుత్వం వైఫల్యం చెందిందని సురేష్ తెలిపారు. పట్టణ పేదలకు సైతం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నివాస స్థలాలు ఉండి ఇండ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇంటి పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. చాలా కాలంగా పట్టణంలో నివాస స్థలాల పంపిణీ జరగలేదని నివాసస్థలం లేని పేదలందరికీ నివాస స్థలాలను తక్షణం పంపిణీ చేయాలని కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను పేదలకు నివాస స్థలాలుగా పంపిణీ చేయాలని సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాడు స్వాతంత్ర్య పోరాటంటోనూ ఆ తర్వాత మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటంలోనూ సిపిఐ వీరోచిత పాత్ర పోషించిందన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన సిపిఐ శత సంవత్సర ముగింపు కార్యక్రమాన్ని డిసెంబర్ 26న ఖమ్మంలో జరుపుకోనుందన్నారు. 20 దేశాల ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభల్లో ప్రజా సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి పోరాట కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బోజడ్ల సూర్యం, త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్, వరదా -నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

మంత్రులు

తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లోని ఆడిటోరియం హాల్‌లో నిర్వహించిన సమీక్షలో పెద్దపల్లి జిల్లా నుంచి మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సమీక్షలో వర్షాభావ పరిస్థితులు, క్రాప్ బుకింగ్, సాగు వివరాలు, విత్తనాలు, ఎరువుల లభ్యత, రైతు భరోసా, ఆయిల్ పామ్ సాగు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, గ్రౌండింగ్ జరిగిన ఇండ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, బడి బాట, మధ్యాహ్న భోజనం, తదితర అంశాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. మన పెద్దపల్లి జిల్లా నుంచి విద్యాశాఖ అధికారి డి.మాధవి, వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాబోయే 3 సంవత్సరాల వ్యవధిలో సాచురేషన్ పద్ధతిలో నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేల దృష్టిలో ఉన్న నిరుపేదల జాబితాను కలెక్టర్‌లకు అందిస్తే ఇందిరమ్మ కమిటీలో ద్వారా స్క్రూటినీ చేయించి, అర్హులైన నిరుపేదలైతే పార్టీలకతీతంగా తప్పనిసరిగా మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కల్తీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి హెచ్చరించారు. బడి బాట కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు, మౌలిక సదుపాయాల కల్పన పట్ల స్థానిక ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులతో కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాలో రివ్యూ నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. కరీంనగర్‌లో ఉన్న జ్యోతి బా పూలే గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించి అక్కడ పరిస్థితుల పై నివేదిక అందించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు పకడ్బందీ చర్యలు జిల్లాలో చేపట్టామని అన్నారు. జిల్లాలో ఉన్న 500 పాఠశాలల్లో మౌలిక వస్తువుల కల్పన పనులు పూర్తి చేశామని, రాబోయే విద్యా సంవత్సరంలో నాణ్యతతో కూడిన విద్య ప్రతి విద్యార్థికి అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ సాగుపై గ్రామాలలో సదస్సులు పెట్టి అవసరమైన సలహాలు, సూచనలు ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పించామని అన్నారు. పంట మార్పిడి విధానం పట్ల విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ తమ ప్రాంతంలో చేపట్టిన ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం వల్ల అంతర్గం పాలకుర్తి మండలాలు తొలిసారి సాగునీరు వచ్చిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి డి. మాధవి, ప్రజా ప్రతినిధులు,, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సండే బ్రిక్స్ ఛాలెంజ్ విజయవంతం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రగతి మైదానంలో నిర్వహించిన సండే బ్రిక్స్ ఛాలెంజ్ విజయవంతంగా సాగింది. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్తగూడెం యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఇందులో పాల్గొన్నారని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ సెషన్ ప్రారంభానికి ముందే పోటీలకు అవసరమైన మిషన్లు, మట్టి, ఇసుక, సిమెంట్, నీరు, నీడ, తాగునీటి ఏర్పాట్లతో సహా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా పూర్తి చేయబడ్డాయన్నారు. ఆరుగురు చొప్పున ఒక టీం ఏర్పడి, ఏడు మిషన్లపై 168 మంది యువతీ యువకులు పాల్గొన్నారని తెలిపారు. ఒక్కో మిషన్ దగ్గర ఒక డీపీఎం ఉద్యోగిని ఇన్‌చార్జ్‌గా నియమించి సాంకేతిక సహకారం అందించారన్నారు. వారు తమ జట్లను ప్రోత్సహిస్తూ, మిశ్రమం తయారీ, బ్రిక్స్ రూపొందించడంలో సహకరించినట్లు చెప్పారు. కాగా కలెక్టర్ ప్రతి మిషన్ వద్దకు వెళ్లి స్వయంగా పరిశీలిస్తూ టీమ్ లనుంచి వివరాలు సేకరించారు. ఇంకా మెరుగుగా ఎలా చేయాలో సూచనలు ఇచ్చారు. కలెక్టర్ తాను స్వయంగా పాల్గొని యువతలో మరింత స్ఫూర్తిని నింపారు. దీనికి బెంగుళూరు నుంచి వచ్చిన సిఎస్ ఈబి నిపుణులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించారు. చివరగా పోటీలో పాల్గొన్న వారందరినీ విజేతలుగా ప్రకటిస్తూ టీ షర్టు, క్యాప్‌లను కలెక్టర్ అందించారు. ఇలాంటి వినూత్నమైన కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల యువత కృతజ్ఞతలు తెలిపారు. రెండవ సెషన్‌లో జిల్లాలోని ప్రభుత్వ శాఖల నుండి సుమారు 300 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మెప్మా బృందాలు, ఐకెపి సీసీలు, ఏపీఎంఎస్ సభ్యులు పాల్గొన్నారు. బెంగళూరుకు చెందిన సాంకేతిక నిపుణుడు సుధాకర్ రెడ్డి వివిధ రకాల మట్టికి తగిన నిష్పత్తిలో ఇసుక, సిమెంట్, సున్నం, నీరు కలపడం ఎలా అన్న విషయాన్ని అర్థమైయ్యేలా వివరించారు. ప్రత్యేకంగా జిల్లాలో లభించే మట్టి రకాలను బట్టి ఏ మోతాదులు సరిపోతాయో వివరించారు. ప్రతి సందేహానికి సున్నితంగా, ఆచరణాత్మకంగా సమాధానాలు అందించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ టెక్నిక్‌ను అర్థం చేసుకొని స్వయంగా మిశ్రమం కలిపి బ్రిక్స్ తయారు చేయడంలో నైపుణ్యం సాధించారన్నారు. ఈ రెండు సెషన్లు పూర్తిగా విజయవంతం వడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తరహా బ్రిక్స్ తయారీ ద్వారా పాఠశాలల ప్రహరీ గోడలు, వంటగదులు, మూత్రశాలలు వంటి నిర్మాణాలను తక్కువ ఖర్చుతో పాటు పర్యావరణ హితంగా తీర్చవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ - తొర్రూరు: కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి చర్చలకు పిలవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి విజయసారథి అన్నారు. ఆదివారం జిల్లాలోని తొర్రూరు మండలం వెల్లికట్టే గ్రామంలో భారత కమ్యూని స్టు పార్టీ మండల 14వ మహాసభ అమరజీవి కామ్రేడ్ దొనక రాజమల్లు ప్రాంగణంలో భారత కమ్యూనిస్టు పార్టీ అరుణ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ బోగా ఈశ్వరయ్య పతాకావిష్కరణ నిర్వహించడం జరిగింది. అంతరం మండల సభ పేరబోయిన కిరణ్, గంధం యాకమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం వామపక్ష భావజాలాన్ని తుద ముట్టించడం కోసం నిర్వహించేదే ఈ ఆపరేషన్ కగార్ అన్నారు. అడవుల్లో ఉన్న ఖనిజ నిక్షేపాలను బడా పారిశ్రామికవేత్తలకు అమ్మటం కోసం చేసే ప్రయత్నమేనని ఆయన తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల ముందర ఇచ్చిన వాగ్దానాల అమలు అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో వాస్తవ లబ్ధిదారులకు మాత్రమే ఇల్లు ఇవ్వాలని, అలాగే గత ప్రభుత్వంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా అర్హులైన పేద వాళ్ళకి ఇవ్వాలని డిమాండ్ ఆయన చేశారు. అనంతరం సిపిఐ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తొరూరు మండలంలో ప్రస్తుతం ఏడు గ్రామ శాఖలు ఉన్నాయని, దీనిని మళ్లీ 15వ మహాసభ వరకు కనీసం 12 గ్రామాలకైనా పార్టీని విస్తరింప చేయాలని కోరారు. మండల కేంద్రాల్లో నూతనంగా నిర్మించిన సైడ్ కాలువల వరకు రోడ్డును విస్తరింప చేయాలని, వంద పడకల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మించాలని, సబ్ రిజిస్టర్ ఆఫీసును, ఏటిఓ ఆఫీస్‌ను కూడా మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్యే ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. జూలై 5, 6 తేదీలలో కొరివిలో జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు ఓమ బిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శి పేరు బోయిన కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఘనపురం లక్ష్మణ్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు, గూడెల్లి ఎల్లయ్య, అన్ని గ్రామాల కార్యదర్శిలు, సహాయ కార్యదర్శిలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు మాజీ సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దీన్ అన్నారు.ఆదివారం నాడు సదాశివపేట లోని సిపిఐ పార్టీ 6మండల మహాసభలు సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజొద్దీన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్.జలాలోద్దీన్ మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇంటి స్థలాలను కేటాయించాలని అన్నారు. ఇందిరామ్మ రాజ్యంలో పేదలందరికీ న్యాయం జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పేర్కొన్నారు. పేదలు తమ ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేయడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, తులం బంగారం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. వర్షాకాలం వస్తున్నందున గ్రామాలకు వెళ్లే రోడ్ల మార్గాలన్నింటినీ బాగు చేయాలని గుత్తేదారులకు ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయి బిల్లులను చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. జిల్లాలో సిపిఐ పార్టీ బలోపేతానికి ప్రతి గ్రామంలో కమిటీలు వేసి పార్టీని మరింత బలోపేతం చేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సదాశివ పేట ఏఐటియసి మండల కార్యదర్శిగా శంకరప్ప సిపిఐ మండల కార్యదర్శి పాండు, పట్టణ కార్యదర్శిగా అనసూయలను ఎన్నుకున్నారు. ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షఫీ అహ్మద్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహమాన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట రాజ్యం, పాడి పరిశ్రమ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, నాయకులు రమేష్, బుజ్జమ్మ, అనుసూయ, సాధిక్ అలీ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : గొర్రెలు మేకల పెంపకం దారుల తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడి సాధించుకోవా లని గొర్రెల మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ పిలుపునిచ్చారు. ఆదివారం గొర్రెల మేకల పెంపకదారుల సంఘం మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభ ఎస్ఎస్ వియల్ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జెండాను గౌరవ అధ్యక్షులు చలగొల్ల మల్లయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొమ్మనబోయిన శ్రీనివాస్ చిత్రపటానికి సంగం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, ప్రొఫెసర్ గడ్డం కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాడబోయిన లింగయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆలేటి యాదగిరిలు పూలమాలవేసి నివాళులర్పించారు. వివిధ ప్రమాదాల్లో మరణించిన వారందరికీ మహాసభలో సంతాప తీర్మానం సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్మడి గోవింద్ ప్రవేశపెట్టి మౌనం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్ల కాపరులు అనేక సమస్యతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల మేకల పెంపకం అనేక పోరాటల ఫలితంగా కెసిఆర్ ప్రభుత్వం గొర్ల పంపిణీ చేస్తామని ప్రకటించిందని, సగం మందికి పంపిణీ చేసి, మిగతా సగం మందిని డీడీలు కట్టించుకుని పంపిణీ చేయకుండా మోసం చేసిందని తెలిపారు. గొర్ల కాపలా అకౌంట్లో రెండు లక్షల నగదు, ప్రమాదవశాత్తు మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు కేశబోయిన మల్లయ్య, చిన్నాల కట్టమల్లు, నూకల లక్ష్మీనారాయణ, సోమనబోయిన లింగయ్య, గంద్రకోటి కుమార్, మానుక సురేందర్, చిన్నబోయిన అశోక్, సూరబోయిన బిక్షపతి, రమేష్. రేఖ దేవేందర్ కుండే అశోక్, చెట్ల రాములు, గుండెబోయిన సత్యనారాయణ, పరిషబోయిన మహేష్, వెంకటేష్, చందు మల్లయ్య, దేవనబోయిన మల్లయ్య, ఆమడగాని రఘు, ఎడ్ల శ్రీనివాస్, నేతుల రాకేష్, సత్తిదోని, రమేష్, నరసయ్య మంచాల హరీష్ పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌కు అధికారులు సకాలంలో హాజరవ్వాలి

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. గిరిజనులు వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలన్నారు. సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలన్నారు. గతంలో వచ్చిన అభ్యర్ధనలు, ఫిర్యాదులకు సంబంధించిన అన్ని వివరాలు సమీక్షించాలన్నారు. తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : బొగ్గు పరిశ్రమలో పనిచేసి దిగిపోయిన ఉద్యోగులకు చమురు సంస్థల్లో రిటైర్ ఉద్యోగులకు అమలు పరుస్తున్న ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ అమలు చేయాలని బొగ్గు పరిశ్రమ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని కోరుతుందని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.బాబురావు తెలిపారు. ఆదివారం నాగ్‌పూర్‌లోని లాంబర్ట్ ఐటి పార్కులో జరిగిన కోల్ ఇండస్ట్రీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫెడరేషన్ సమావేశంలో సింగరేణి నుంచే కోల్ మైన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.బాబురావు, సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.వి.దత్తాత్రేయులు పాల్గొని ప్రసంగించారు. పెన్షన్ పెరుగుదల కోసం న్యాయపోరాటం, రాజకీయ వత్తిడి, పెద్ద ఎత్తున పబ్లిక్ పెన్షనర్స్, వితంతువులు కలిసి డిల్లీలో పెద్ద ఎత్తున భారీ నిరసన ప్రదర్శన చేస్తూ కేంద్రంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఆర్ ఎంఎస్ మెడికల్ స్కీంలో ఎదురవుతున్న సమస్యలు, తదితర అంశాలపై చర్చించారని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షులు రామోపాధ్యాయ సందేశమిచ్చారని, నాయకులు కటియార్ అధ్యక్షత వహించారని ఆయన వివరించారు.

పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులను అభినందించిన డైరెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి సంస్థ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులను డైరెక్టర్ డి.సత్యనారాయణరావు అభినందించారు. భారత ప్రభుత్వం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సింగరేణిలో ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ వ్యాప్తముగా అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులతో విజయవంతంగా సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులను, సిబ్బంధిని సంస్థ డైరెక్టర్ అబినందించారు. అనంతరం భారత ప్రభుత్వ మినిస్ట్రి ఆఫ్ అయూష్ ప్రధానం చేసిన ధృవీకరణ పత్రాన్ని జీఎం కిరణ్ కుమార్ కు కి అందజేసారు. ఈ కార్యక్రమములో డిజిఎంలు కేసా నారాయణరావు, బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు, డివై.ఎస్ఈ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

షాపల్లిగ్రామంలో సైడ్ డ్రైన్ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : ఏటూరునాగారం మండలంలోని షాపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఏటూరునాగారం మండల కమిటీ ఆధ్వర్యంలో సైడ్ డ్రెన్ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని, స్థానిక కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు రఘు తెలిపారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ క్రింద షాపల్లి గ్రామంలో 35 లక్షల రూపాయలతో సైడ్ డ్రెన్ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని, మంత్రి సీతక్క సహకారంతో రోడ్డు సైడ్ డ్రైనేజీస్ కోటి, 5 లక్షలతో గ్రామ అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా స్కూల్‌కు, గుడికి, నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక ఎలక్షన్‌లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ అయూబ్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు, మండల ఉపాధ్యక్షులు వీసం నర్సయ్య, ఎండీ రియాజ్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగిరి మధుబాబు, టౌన్ అధ్యక్షులు ఎండీ సులేమాన్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, యూత్ ఉపాధ్యక్షులు సర్వ అక్షిత్, జిల్లా యూత్ కార్యదర్శి ఎండీ గౌస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గద్దల నవీన్, టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండారి లక్కీ, గికూరు భాగ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు చేల వినయ్ కుమార్, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు కర్ని సత్యం, మండల బీసీ సెల్ అధ్యక్షులు కుదురుపాక శ్రీనివాస్, మామిడి రాంబాబు పాల్గొన్నారు.

మార్కెట్లో రైతులకి ఇబ్బందులు లేకుండా చూడాలి

విశాలాంధ్ర - ఖమ్మం : మార్కెట్లో ధాన్యం అమ్ముకోవడానికి రైతులొస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా మేలు జరిగే విధంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అన్నారు. ఖమ్మం మార్కెట్ పాలకవర్గాన్ని ఆయన కలిశారు. ఖమ్మం మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ చైర్మన్ హనుమంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగిన కార్మికులు, రైతు సంఘాలు, వ్యాపారస్తుల సమన్వయ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రైతుల ధాన్యాన్ని దిగుమతి ఎగుమతులు, ధాన్యం బస్తాలు కాటాలులో రైతులపై ఆర్థిక భారం పడకుండా చూడాలని వారు పేర్కొన్నారు. మార్కెట్లో ధాన్యం అమ్ముకోవడానికి వచ్చిన రైతుకు కనీస సౌకర్యాలు కల్పించాలని, వారు మార్కెట్ కమిటీకి విజ్ఞప్తి చేశారు. వీరితోపాటు ఏఐటీయూసీ నాయకులు మేకల శ్రీను, గాదే లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ రైతులు కార్మికులు సమన్వయంతోని పరిస్థితులు అంచనా వేసుకుని మార్కెట్లో కలిసిమెలిసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

సాహితి

అనువాద కవిత

పలస్తీనా ఘోషణ

హిందీ మూలం: అద్‌నాన్ కఫీల్ దర్‌వేశ్
తెలుగు అనువాదం: డా॥తక్కోలు మాచిరెడ్డి

మా కొవ్వొత్తులు వెలుగుతూనే ఉంటాయి
మా బృందగానం విన్పిస్తూనే ఉంటుంది
ఈ మా నివాస స్థలంలోంచి!
దైవం అంతిమన్యాయం చేసే వరకూ
మృత్యువు మానుంచీ ఏదీ అపహరించలేదు
మా కలలనూ/ మా స్వాతంత్ర్యేచ్ఛనూ...
మా పెదవుల పూలు వికసిస్తూ ఉంటాయి
తుపాకి మందు వాసనలో కూడా
మా ఖ్యాతి విస్మృతికి లోనవదు
మేము రక్త రంజిత దుప్పట్లు కప్పుకొని, దుమ్ములో పడి
వికసిస్తూ ఉంటాము పువ్వుల్లా
నీవు చేసే ప్రతి విచక్షణారహిత హత్యాకాండ తర్వాత
సారిసారికీ, ఒకదాంతర్వాత మరొకటి
మాపై చేసే ప్రతి భయంకర దాడి
ఐనా, ఎప్పటికీ నువు జయించలేవు
ఎప్పటికినీ,
అందుకే ఓ క్రూరుడా
ఈ యుద్ధం ఆపు
లేకపోతే
ప్రళయమే మరి

ఎరుకల జీవనవ్యథల గాథాపేటిక

సన్నిధానం నరసింహాశర్మ
సెల్: 9292055531

నింగిని తాకాలనే తహతహలతో పెరిగే కాంక్రీటు భవనాల్ని వారు కోరుకోవడం లేదు. నల్లధనం, తెల్లధనం తేడాల ఊసులు వారికి లేవు. లౌక్యాలకు, అతి సౌఖ్యాలకూ వారు ఆమడ దూరం.

బతుకుకు కూడు, నిలవడానికి ఓ నిలకడ గూడు, తమ బతుకులు సాగడానికి సాగుకు కొంత నేల, కట్టుకొను వస్త్రాలు, మేమూ సామాజికులలో ఒక భాగమేనని తలలెత్తుకోవడానికి నాలుగు అక్షరం ముక్కలూ- ఇవి మాత్రమే కోరుకునే సత్తెకాలపు జనం వారే ఏకలవ్య కాలనీ ఎరుకలు.

అన్నిటి కంటే వారు కోరుకునేది ఆత్మ గౌరవం స్వాతంత్ర్యపు భావాలూ. ఈ మనదేశపు మూలవాసులందు ఆదివాసుల్లో ఎరుకలు ఒక ముఖ్యమైన తెగ. వారికి సంబంధించిన జీవన వాస్తవాలను చూద్దామంటే, వారి నవ్వులు, కన్నీళ్లు అస్తిత్వ పోరాటాల సంఘటనలను కుటుంబాలను, అందులోని పాత్ర వైచిత్రులను గమనిద్దామనుకుంటే-సమాంతర సంస్కృతి భాగస్తులతో కరచాలనాలైనా చేద్దామంటే- 'ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు' అనే గ్రంథ అధ్యయన దర్శనం చేయండి.

ఈ గ్రంథ రచయిత పలమనేరు బాలాజీ. చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన బాలాజీ తమ పదిహేడవ ఏట నుంచి రచనలు కొనసాగిస్తూ వచ్చారు. గతంలో 'మాటల్లేని వేళ', 'ఇద్దరి మధ్య' స్వీయ కవితా సంపుటాలు, 'చిగురించే మనుషులు' వంటి విలక్షణ కథలు, 'నేల నవ్వింది' వంటి సామాజిక వస్తుభరిత నవల- ఇటువంటి రచనలు తీర్చిన రచయిత. ఆంగ్ల, కన్నడ భాషల్లోకి సైతం వీరి రచనలు కొన్ని అనువాదాలై ప్రాంతీయ సరిహద్దులు దాటాయి.

ఎంత గొప్ప రచయితకైనా ఒక ప్రేరణ రంగం అంటూ ఒకటి వుంటూ ఉంటుంది. అటువంటి రంగ భూమికల్ని సిద్ధం చేసే పెర్‌స్పెక్టివ్స్ అని ప్రచురణ సంస్థ ఈ నిశిత ఆలోచనల గ్రంథాన్ని వేసింది.

సోషల్ సైన్సెస్ ప్రాధాన్యాన్ని గమనించి సీరియస్ గ్రంథాలను మాత్రమే ప్రచురించే పెర్‌స్పెక్టివ్ సంస్థ లోగడ బాలగోపాల్, వరవరరావు, కోదండరాం, అల్లం రాజయ్య, కె.శ్రీనివాస్, లలిత, షాజహానా, ప్రభృతుల గ్రంథాలు వేశారు. ఇందులో ఎ.కె.ప్రభాకర్ సంపాదకత్వ పీఠికాధ్యయన దీపికా వేదికలు రచనల రచయితల మూలతత్వాలను విశ్లేషించారు. ఆ కొనసాగింపులో వచ్చిన గ్రంథమే ఈ 'ఏకలవ్య కాలనీల ఎరుకల జీవన గాథలు'.

రచయిత ఆత్మకథగా, కుటుంబ కథగా, బంధు మిత్రుల దుఃఖాల గాయాల కథగా అభివ్యక్తమైనా, ఇది సంపూర్ణ సామాజిక నవల అని ఇందులోని అంతర్లీన అంశాలు విప్పి చెపుతాయి. సమాజమంటేనే ఓ పెద్ద కుటుంబం.

నా కలానికి కన్నీళ్లే తోడు అని అర్థవంతమైన స్వీయ ప్రకటన చేసుకున్న రచయిత బాలాజీ.

ఏడుకొండలపై ఆ బాలాజీ ఉంటే ఏడ్చే గుండెలపై ఈ బాలాజీ ఉంటారు. ఆ గుండెలు ఎరుకలవి. బుట్టలూ, తట్టలూ అల్లడమే కాదు, అవసరమైన కవితలూ కథలూ కూడా అల్లుతాం అని నిరూపించుకున్నారు బాలాజీ! అష్టాదశ పర్వాలతో భారతం అద్భుత గ్రంథమైంది. అష్టాదశ కథలతో ఈ ఎరుకల జీవన సార గ్రంథం అందగించింది.

ఎరుకలు అడవి నుంచి వెదురు కొట్టుకువస్తారు. ఈతాకుల్ని కోసుకొస్తారు. ఇంటిల్లిపాదీ శ్రమిస్తారు. గంపలూ, చాపలూ, బుట్టలూ, ధాన్య రక్షణకు గాదెలూ, తడికెలూ తయారుచేస్తారు. అడవులకీ- గ్రామ నగరాలకు అనుసంధాన జీవనం సాగిస్తుంటారు. ఎంత శ్రీకృష్ణుడైనా ఊదే మురళికి వెదురే అవసరం. ధాన్యాల రాశులు కాపాడడానికి గాదెలు అవసరం. ఉత్సవ కార్యాల వంటి



సందర్భాలలో అన్నపు రాశులు పోయడానికీ పెద్దపెద్ద బుట్టల వంటివి అవసరం. గ్రామాల ఇళ్లల్లో తడికల అవసరం అంతాయింతా కాదు. సామాజిక చర్చాగోష్ఠుల కాలవాలాలైన అరుగులపై ఆతిథ్య ఆహ్వానాలుగా పరచబడేవి చాపలే. వీటిని అల్లే నిర్మాతలు ఎరుకలు. అడవుల్లో కొందరు, అటవీ సమీపాల్లో కొందరు ఎలా బతుకులు సాగిస్తున్నారో చూడడానికి ఓ పగలని అద్దం ఈ బాలాజీ రచయిత కథా సంపుటి. పందుల్నీ, గాడిదలనీ పెంచేవారు. పొలాలకు ఎరువుల్ని సమకూర్చేవారు ఈ ఎరుకల్లో ఉన్నారు. పట్టణాలు, గ్రామాలు సంతరించుకున్న సంతల్లో తమ శ్రమ స్వేద బిందువుల్ని కేవలం బతకడానికి మాత్రమే సొమ్ము చేసుకునే ఈ ఎరుకలు విద్యా, వైద్య, జీవనరంగాల్లో కనీసపుకోర్కెలు తీర్చుకోవడానికి ఎంతశ్రమ పడుతుంటారో ఇందులోని వివిధ కథాసంఘటనలు అద్దాలౌతాయి, అర్థాలవుతాయి. ఎరుకల్లో మహిళల్లో కొందరు సోదె చెప్పే వారున్నారు. ఇంత, అంత లావుపాటి సైకాలజీ గ్రంథాలు చదవకుండానే వారు చెప్పేవి వింటే ఆశ్చర్యం వేస్తుంది. విశ్వసించేవారు ఇప్పటికీ ముఖ్యంగా గ్రామాల్లో సవాలక్షల మంది ఉన్నారు.

"పదకొండు నెలల జీతగాడి కథ" అనే ప్రథమ కథ ఒక కరుణ రసాత్మక కావ్య ఖండికలా అనిపిస్తుంది. ఇందులోని తండ్రి పాత్ర ఒక ఫారెస్టు డిపార్టుమెంటులోని చిన్న ఉద్యోగి. ఆయన బస్సులందు ప్రయాణిస్తే సొమ్ము ఖర్చువుతుందని ఫ్రీగా లారీలపైనే కష్టపడి ప్రయాణం చేసి వచ్చి ఆ సొమ్మును కుటుంబానికి పిల్లలకి వెచ్చిస్తాడు. ఆయన రచయిత తండ్రే! తన మొదట కథా సంపుటాన్ని తండ్రికి అంకితమిస్తూ రాసిన మాటల్లో-

"కొట్టీ...తిట్టీ/ బలవంతంగా నాచేత యాపిల్ తినిపించిన నాన్నా!/ నువ్వెప్పుడైనా ఒక్క పండైనా తిన్నావా తండ్రీ?" అనడంలో తండ్రి ప్రేమ పాత్రకు, కరిగిపోయిన పుత్ర పాత్రను (రచయిత పాత్రే) ఒక కొన్ని మాటల కవితగా చెప్పినట్లయి. తండ్రి పట్లేకాదు, తన సమాజం పట్ల కూడా రచయిత అంతే ప్రేమ ఉందనిపిస్తుంది. ఆ ప్రేమ బాధ్యతై ఇందులోని కథల్ని రాయించింది. బంధుమిత్రులు అతిథులుగా వచ్చిన సందర్భాలలో ఇంట్లో ఏమీలేక, కంట్లో నీళ్లు కనబడకుండా ఒక కుటుంబ స్త్రీ తన ముక్కుపుడక, ఉంగరం, కమ్మలు వంటివి తాకట్టు పెట్టి భర్తకు చేదోడయిన కుటుంబ మహిళ పాత్ర ఈ ఎరుకల కుటుంబంలో ఎలా ఉందో నాగరిక సమాజం కూడా తెలుసుకోవాలనిపిస్తుంది.

చదువులకు, వైద్యాలకు, చిన్న పెద్ద సమస్యల పరిష్కారాలకు ఎరుకలు వారి ప్రతినిధులు పడిన నానాబాధలు, దొరతనం ఉద్యోగులతో పడిన పాట్లు- ఎన్నో రకరకాలుగా చూడడానికి ఈ గ్రంథం సాంతం చదవవలసిందే. తప్పు చేయకుండా దొంగ దొంగతనం ఆపాదించబడిన యువకుడు తన కొడుకు రక్షక భటుల వేధింపులకు భయపడి, వూరు నుంచే పారిపోయి మళ్లీ కనబడకపోతే అతని ముసలితండ్రి ఇతర వూళ్లనుంచి వచ్చినవాళ్లని మా అబ్బాయి ఎక్కడైనా మీకు కనబడ్డాడా అని నులక మంచంపై ఉండి అడగడాలు దయనీయంగా ఉంటాయి. తన కొడుకు అశోక్. రక్షక వ్యవస్థకు భయపడి అతీగతీ లేకుండా వెళ్లిపోయిన అశోక్‌కు కడుపునిండా అన్నం తినిపించాలని వాడి కిష్టమైన ములక్కాయల చారుతో అన్నం ముద్దలు వాడు తినడము, తనకు పెట్టడమూ తాను మట్టిలో కలిసేలోగా చూడగలనా అని పడిన వేదన రచయిత కన్నీళ్ల సిరాతో రాశారేమో అనిపిస్తుంది.

వీరు తమ అస్తిత్వ సంరక్షణా భాగంగా తమ పేర్ల చివర కులం పేరును చేర్చుకోవాలని ఒక కథలో సూచింపబడుతుంది. 'అమర జీవి మా కాంతమ్మత్త!' కథలు ముగింపులో- కాంతమ్మ పరంగా.

"మనుషుల మాటల్లో, మనసుల్లో, జ్ఞాపకాల్లో బతికి ఉండటమే కదా అమరత్వం" అంటే అన్నారు రచయిత. అటువంటి అమరత్వం ఉన్న కథాసంపుటి. ఇందులో ఎరుకల ప్రశ్నలున్నాయి. సమస్యలున్నాయి. సమాజం జవాబుదారీతనానికి కథల రూపాల్లో అడగడాలున్నాయి. కథాకథనంలో శిల్పం అద్భుతంగా సాగింది. కవి కథకుడైతే ఒనగూడే రసగుణాలూ ఉంటాయని బాలాజీ తన రచనల ద్వారా కూడా నాట బలికారనిపించింది. అన్ని కథలూ ప్రయోజనాత్మకాలే! ఇది ఎరుకల జీవన వ్యథల గాథాపేటిక. పుటపుటా సమస్యలు చెప్పుటలో ఆలోచింపజేయుటమే!

శిరసా నమామి శ్రీ శ్రీ

సంఘసేవనే సతతము తలచి
దీనులందరిని మదిలో నిలిపి
కష్టజీవి కిరుపక్కల నిలిచి
మేలుకోరుతూ, మేలుకొల్పుతూ
అణగారిన వారందరి చేతికి
అక్షరాస్త్రమందించిన నీ నీతికి
వినమ్రమైన వినతులు ఇవిగో!
ప్రజాకవీ! నా ప్రశంసలివిగో!

బాధల కాలం ఆవహించినా
అవరోధాలు ఆవరించినా
దివారాత్రులూ దీక్ష వహించి
పీడిత వర్గముసుద్ధరించిన
నీ కర్తవ్యం, నీ కారుణ్యం
నీ సాహిత్యం, నీ సామర్థ్యం
ప్రణామ శతముల పాత్రములయ్యా!
ప్రపంచ హితకర పారములయ్యా!

ఆర్థిక లాభాపేక్ష త్యజించి
స్వార్థం, సౌఖ్యం పరిత్యజించి
నిరంతరం ఒక నిబద్ధాత్మవై
నిర్నిద్రంగా, నిరాఘాటముగ,
నిరాతంగముగ, నీతి బద్ధముగ
పోరాడే సంకల్పధారివై
కావ్యలోకమున సముద్భవించిన
వర్ణ విరించీ! వందన శతము!
నా కవితాత్మకు ప్రేరణమైతివి!
కర్తవ్యానికి కారణమైతివి!
విశ్వవ్యాపిత విషాద జీవుల
విరామమెరుగని విప్పత్తులన్నీ
విశాల హృదితో వీక్షణ చేసి
సక్రమ విక్రమ రచనాచరణకు
మార్గము జూపిన మహానుభావా!
మాన్యుడవయ్యా! గణ్యుడవయ్యా!

భావజాలముకు మానవత్వమూ
భాషామాతకు ఆధునికత్వము
సమాజానికి నవ యువరక్తము
ఉద్యమాలకు సమధిక సత్త్వము
తెనుగు కైతలకు వ్యాప్తాన్నత్యము
అందించిన ఓ నవయుగకర్తా!
అందుకోవయా అభివందనలు!
అఖిలాంధ్రప్రజ అభినందనలు!

ఎరుకలపూడి గోపీనాథరావు
98482 93119

పలమనేరులో జూన్ 29న సాహిత్యసభకు ఆత్మీయ ఆహ్వానం

చిత్తూరు జిల్లా సీనియర్ సాహితీవేత్త కీ.శే. సి. వేణు గురించి డాక్టర్ మధురాంతకం నరేంద్రచే స్మారక ఉపన్యాసం, పలమనేరు బాలాజీ రెండు పుస్తకాలు: గీతాంజలి స్మారకపురస్కారం, సడ్లపల్లె కథాపురస్కారం పొందిన "ఏకలవ్య కాలనీ" ఎరుకల జీవన గాథలు" కథా సంపుటి, "లోపలేదో కదులుతున్నట్టు" కవితాసంపుటి పరిచయ కార్యక్రమం చిత్తూరు జిల్లా పలమనేరు, లయన్స్‌క్లబ్‌లో జూన్29వతేదీ ఆదివారంఉదయం పదిగంటల నుంచి జరుగుతుంది. మధ్యాహ్నంభోజనం తర్వాత రచయితలు, కవుల ఇష్టాగోష్ఠి. స్వచ్ఛత ప్రచురణలు బెంగళూరు పక్షాన సి. భానుమూర్తి రెడ్డి, సాహితీవేత్తలు శ్రీయుతులు ఎన్. వేణుగోపాల్, ఆర్.ఎం.ఉమామహేశ్వర రావు, వి. ప్రతిమ, ఖాదర్, సుంకోజి దేవేంద్రా చారి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, వంగాల సంపత్ రెడ్డి, పల్లిపట్టు నాగరాజు, ఎండపల్లి భారతి, టిఎస్ఏ కృష్ణమూర్తి తదితరులు పాల్గొంటారు. సాహితీ మిత్రులు, సాహిత్యాభిమానులందరూ పాల్గొనవలసిందిగా సాదర ఆహ్వానం.

పలమనేరు బాలాజి, 9440995010

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, శ్రీకాకుళం జిల్లాశాఖ నిర్వహిస్తున్న

పుస్తక ఆవిష్కరణ, పరిచయసభ

జూన్ 29, 2025, ఆదివారం ఉదయం 9.30ని॥లకు బాపూజీ కళామందిరం, శ్రీకాకుళం వేదికగా ఏ.పి.టి.ఎఫ్. సీనియర్ నాయకులు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి సి హెచ్ ప్రభాకరరావు జీవిత భాగస్వామి శ్రీమతి చిగురుపల్లి చంద్రకళ జ్ఞాపకంగా వెలువరించిన రెండు పుస్తకాలు "ఉరికంబం సాక్షిగా...", "గీసి చెరిపే బొమ్మ" ఆవిష్కరణ - పరిచయం ఒకేవేదిక నుంచి జరుపనున్నారు. దివికుమార్ రచన "ఉరికంబం సాక్షిగా..." భగత్‌సింగ్ జీవితంపై వ్యాస సంపుటిని ఏ.పి.టి.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి పరిచయం చేస్తారు. కంచరాన భుజంగరావు కవితాసంపుటి "గీసి చెరిపేబొమ్మ"ను ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు ఆవిష్కరిస్తారు. డా. సుంకర గోపాలయ్య పరిచయం చేస్తారు. సాహిత్యాభిమానులకు సాదర ఆహ్వానం.

మజ్జి మదన్ మోహన్, అధ్యక్షులు,
ఎస్ వి అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, శ్రీకాకుళం జిల్లాశాఖ

అభ్యుదయమే పరమావధిగా డా.శివకుమార్ బాలసాహిత్యం

డా. టేకుమళ్ల వెంకటప్పయ్య,
94904 00858

గ్రంథ సమీక్ష

2025 సంవత్సరానికి నెల్లూరు జిల్లాకు చెందిన డా.గంగిశెట్టి శివకుమార్‌కు బాలసాహిత్యం విభాగంలో కేంద్ర సాహిత్యపురస్కారం పొందారు. ఈ పురస్కారం వెనుక ఆయన చేసిన ఆరు దశాబ్దాల కృషి దాగి ఉంది. డా.గంగిశెట్టి శివకుమార్ గత 57 సం.లుగా బాల సాహిత్యం రాస్తున్నారు. చందమామ, బాలమిత్ర లాంటి అన్ని పిల్లల పత్రికల్లో ఆయన కథలు వచ్చాయి. తెలుగులోనే కాకుండా చంపక్, గోకులం వంటి ఆంగ్ల పత్రికల్లో సైతం కథలు రాశారు. మూన్ బీమ్ అనే ఆంగ్ల కథలతో అమెరికాలో పిల్లలకొరకు రాశారు. ఆ పుస్తకాన్ని ఐడ్రీం పబ్లికేషన్స్ సంస్థ అమెరికాలో ప్రచురించారు. బి.ఎస్సీ చదివినప్పటికీ భాష మీద ప్రేమతో ఎం.ఎ (తెలుగు) చదివి, బాలల కథలు మీద పరిశోధనచేసి ఎస్వీయూ తిరుపతి నుంచి డాక్టరేట్ పొందారు. చందమామ పత్రికలో రెండేళ్లు సబ్ ఎడిటర్‌గా ఉద్యోగం చేసి, కొడవటిగంటి కుటుంబరావు శిష్యరికంలో బాల సాహిత్యంలో రాటుదేలారు. ఆ తర్వాత నెల్లూరు జిల్లాలో ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపికయ్యారు. బాలసాహిత్యానికి సంబంధించి 40 పైచిలుకు పరిశోధనా పత్రాలు సమర్పించారు. బాలబంధు, బాలసాహితీ సామ్రాట్ లాంటి బిరుదులు పొందారు. సీఇ.ఐ.ఐ.ఎల్ మైసూరు వారు జరిపిన బాలసాహిత్య వర్కుషాపుల్లో పాల్గొన్నారు. తెలుగులో బాలగేయాలు, మాటలతో ఆటలు రూపకల్పన వంటివి ఎన్నో చేశారు. పున్నమి, పుణ్యభారతి లాంటి పత్రికల్లో బాలల కథా శీర్షిక నిర్వహణ చేస్తున్నారు. వీరి కథలు అన్ని దిన, వార, మాస పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

ఎన్నో వేల సంవత్సరాలుగా బాలసాహిత్యం వర్ధిల్లుతున్నది. కాశీ మజిలీకథలు, పేదరాసి పెద్దమ్మ కథలు, మర్యాద రామన్న కథలు, అక్బర్ బీర్బల్, తెనాలి రామకృష్ణ, యిలా ఎన్నో మన ప్రాంతంలో ఉండగా, అరేబియన్ నైట్స్ కథలు, ఈసపు నీతి కథలు వంటివి ఇతర దేశాల్లో ఉన్నాయి. దేశమేదైనా బాలలందరి మనస్తత్వం ఒకటే! కథ చెబుతానంటే వెంటనే వచ్చి దరిచేరని బాలబాలికలు ఏ దేశంలోనూ ఉండరు. అయితే వారికి మనం ఏం చెప్తున్నాం? బాలల మనసు పరిపక్వతకు అభ్యుదయ భావాలనే నూరిపోస్తున్నామా? మూఢ నమ్మకాలను పెంచిపోషిస్తున్నామా అన్నది ఈనాటి బాల సాహిత్యవేత్తలు ఎవరికివారు ప్రశ్నించుకోవాలి. పిల్లలకు నీతి అంతర్లీనంగా బోధించే కథలు రావలసి యున్నది. ఈ విషయంలో డా.గంగిశెట్టి శివకుమార్ అనేక కథలు రాసి విజయం సాధించారు. ఇంకా రాస్తూనే ఉన్నారు.

అభ్యుదయ రచయితల సంఘం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు అధ్యక్షునిగా కొనసాగుతున్న శివకుమార్ "కబుర్ల దేవత" అనే బాల సాహిత్య పుస్తకానికి కేంద్ర సాహిత్య పురస్కారం లభించడం ఆనందదాయకం. ఆ కబుర్ల దేవత చెప్పిన కబుర్లేమిటో చూద్దాం. ఇందులో మొత్తం 36 కథలు. కథలన్నీ అంతర్లీనంగా ఏదో ఒక సందేశాన్నిచ్చేవే! చాలా కథలు అభ్యుదయ మార్గాన్ని బోధిస్తాయి, చెడును తొలగించి మంచిని ప్రబోధిస్తాయి.

మొదటి కథ "కబుర్ల దేవత". ఇందులో కామయ్య అనే ఒక వాగుడుకాయ. అతనికేం పనీపాటా లేకుండా అడిగిన వారికీ అడగని వారికీ ఏవో కబుర్లు చెబుతూ ఉంటాడు. పైసా సంపాదన లేకుండా ఉండడం కాకుండా అందరినీ విసిగిస్తున్నాడన్న ఆవేదనతో భార్య ఒక గదిలో పెట్టి తాళం వేస్తుంది. కామయ్య ఊరుకుంటాడా? గోడతో కబుర్లు చెప్పడం ప్రారంభిస్తాడు. గోడ ఎన్నిరోజులైనా మాట్లాడక పోయేసరికి గోడను ఇన్ని కబుర్లు చెప్పినా మాట్లాడవేమిటి? అని నిలదీసే సరికి గోడలో నుంచి ఒక కబుర్ల దేవత ప్రత్యక్షమై కామయ్య చెప్పిన కబుర్లకు మెచ్చి బస్తాడు బంగారు నాణేలు ఇస్తుంది. పక్కింటి రామయ్యకు కన్ను కుట్టి అసలు విషయం కామయ్య నుంచి రాబట్టి తనూ గోడకు కథలు చెప్పడం ప్రారంభిస్తాడు. కబుర్ల దేవత ప్రత్యక్షమై కామయ్య చెత్త కబుర్లకు కోపించి మూగవాణ్ణి చేస్తుంది. కామయ్య దేవత కాళ్లమీదపడి బతిమలాడుకోగా క్షమించి వదిలేస్తుంది. చూడడానికి ఈ కథ తమాషాగా ఉన్నా, ఇందులో ఒకరిని చూసి మరొకరు దురాశతో ప్రవర్తిస్తే తగిన ఫలితం లభిస్తుందన్న నీతి ఉంది.

రెండవ కథ "యథారాజా తథా ప్రజా" అన్న కథలో



ఒక మహారాజు జీర్ణించిపోయిన ఒక దేవాలయ పునరుద్ధరణ మూలధనంకోసం కొత్తరకంపన్ను ఒకటి ధనవంతుల మీద వేయగా, ఆ భారం వాళ్లు తమదగ్గర పనిచేసే జీతగాళ్ల మీదవేసి, వారి జీతంలో కోత పెడతారు. విషయం తెలిసిన రాజు ఎంతో బాధపడి ఆ పన్నును తొలగించి, తను రాజభవనంలో జరుగుతున్న వృధా ఖర్చును తగ్గించి సొమ్ము కూడబెడతాడు. కింద నున్న ఉద్యోగులు సైతం అదే విధంగా చేసి మరికొంత ధనం పోగుచేసి దేవాలయాన్ని వైభవోపేతంగా చేస్తారు. దీనిలో నీతి అభ్యుదయ మార్గంలో ఉన్నదని వేరే చెప్పనక్కరలేదు. నేడు మన ప్రభుత్వాధికార్లు ప్రయాణించే హెలికాప్టర్లు, కేన్వాయ్ వాహనాల ఖర్చుల వంటివి మానుకుంటే, ఆ ధనం ప్రజా సంక్షేమం కోసం వాడవచ్చుననే నీతి అంతర్లీనంగా చెప్పారు శివకుమార్.

"మీనాక్షి తెలివి" అనే కథలో భోళామనిషి మాధవయ్య పొగడ్తలకు లొంగిపోయి, ప్రతివారం సంతకు వస్తున్న శంకరయ్యకు భోజనం పెట్టి పంపుతూ ఉంటాడు. మీనాక్షి చూసి చూసి ఒక రోజు లడ్డు మీద లడ్డు వడ్డిస్తే తినలేక పోతాడు శంకరయ్య. మీనాక్షి అదేమిటి మీరు పొగిడే పొగడ్తలకు మా వారు వెగటుపడ్డారా? అని అన్యాపదేశంగా చెప్పేసరికి శంకరయ్యకు బుద్ధివస్తుంది.

మరో కథ "సన్యాసివరం" లో స్వార్థపూరితమైన వరాలు అడగకూడదు అన్న నీతి ఉంది. "పెంచిన ప్రేమ" అన్న కథలో మనుమడు వేసిన మొక్క ఆకులను ఒక మేక తినేసే సరికి బెంగపడి జ్వరాన పడతాడు. తాత కొడుక్కి పెంచిన ప్రేమ అలాగే ఉంటుంది అనేసరికి, కొడుకు యదార్థం గ్రహించి, తన ఇంటి చుట్టూ ఉన్న చెట్లను నరకాలన్న ఉద్దేశాన్ని మానుకొంటాడు. చెట్లూ చేమలూ ఆరోగ్యానికి అవసరమని తెలియజేసే కథ. స్నేహం కూడా సమాన స్థాయిలలో ఉన్నవారితోనే చేయాలని ఋజువు చేస్తుంది "తగిన స్నేహం" కథ. ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలిపే కథ "మంత్రి యుక్తి". ధనవంతుడు గొప్పా? లేక విద్యావంతుడు గొప్పా? అనే విషయాన్ని పరిశీలించ డానికి వెళ్లిన విశాలునికి విద్యావంతుడే గొప్పవాడన్న బోధను కలిగిస్తుంది "ఎవరు గొప్ప?" అనే కథ.

"ధర్మ వర్తన" కథలో ధర్మంతో బతకమని తన తాతగారు చెప్పిన మాటలు ఆచరణలో ఎలా సత్ఫలితా లిస్తాయో తెలుసుకుంటాడు మాధవుడు. "తల్లి చెప్పిన నీతి" అనే కథలో కష్టపడి సంపాదించిన డబ్బును ఎలా పొదుపుగా వాడుకోవాలో నేర్చుకుంటాడు రవి. కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవాలనే నీతి "అందరూ దేవుని పిల్లలే" అన్న కథలో తెలుసుకోవచ్చు. మేలు చేసిన వాడికే కీడు చేయాలని తలపడితే ఏమి జరుగుతుందో "వింత నేరేడు పండ్లు" కథలో ఉంది. అన్ని యుద్ధ విద్యలలో విజయం సాధించే సుధన్వుడికి "లోకం తీరు" ఎలా ఉంటుందో తెలియజేసే కథ. "వ్యాపారి నిర్ణయం" కథలో వ్యవసాయం, వ్యాపారం రెండూ డబ్బు సంపాదించే మార్గాలే అయినా, తండ్రి పెట్టిన పోటీలో ఎక్కువ లాభం గడించిన చిన్నవాడికి వ్యాపారం అప్పగించకపోవడానికి కారణం అత్యాశ పనికిరాదని తెలియజేస్తుంది. అన్నదమ్ముల్లో తమ్ముడికి ఉన్న అసూయను అన్న ఏవిధంగా నాటకమాడి పోగొట్టాడో తెలియజేసే కథ "అసూయ". గురువు తనని చీటికి మాటికి దండిస్తున్నాడని బాధపడిన వల్లభుడికి ఎలా జ్ఞానోదయం కలిగిందో చెప్పే కథ "గురు హృదయం". యిలా మిగిలిన అన్నీ కొత్తరకంగా పిల్లలకు నీతిని అంతర్లీనంగా భోదించేవి.

అంతర్జాలం దెబ్బతో పుస్తకాలు చదువని బాలలకు ఒక్కసారి డా.శివకుమార్ పుస్తకం చేతికిస్తే ఇక వదల కుండా చదువుతారని ఋజువు చేస్తాయి ఈ కథలు. పిల్లలకు నైతిక విలువలు, సాంఘిక నైపుణ్యాలు, భాషా నైపుణ్యాలు నేర్పించడానికే బాలసాహిత్యమున్నదన్న ఆలోచనతో, కథల ద్వారా మంచి, చెడులను, స్నేహం, సహాయం వంటి విషయాలను నేర్పించవచ్చునని ఋజువు చేస్తాయి. కథలన్నీ పిల్లలు చదువుతున్నప్పుడు వినోదం పొందుతూ ఆకర్షించి, చదవడంపై ఆసక్తిని పెంచే స్థాయిలో ఉన్నాయి. పిల్లల ఊహాశక్తిని, సృజనాత్మకతను పెంచేలా ఉండడమే కాక, కొత్త విషయాలను నేర్చుకోవడానికి, సమస్యలను విభిన్న కోణాల్లో ఆలోచించి పరిష్కరించేందుకు వారిని ప్రోత్సహించే కథలు. మంచి లక్షణాలను అలవర్చే ప్రాథమిక సాధనమే బాల సాహిత్యమని త్రికరణ శుద్ధిగా నమ్మిన వ్యక్తి డా.శివకుమార్. సమాజ ప్రగతికి శాస్త్రీయ రూపం విద్య, కళాత్మక రూపం సాహిత్యం, ఈ రెండింటి సమ్మేళనంగా బాలసాహిత్యం ఉండాల్సిన అవసరం ఉందని తన కథల్లో చెప్పారు. "ది ఇంటరెస్ట్ ఆఫ్ చైల్డ్ హుడ్ అండ్ ది యూత్ ఆర్ ది ఇంటరెస్ట్ ఆఫ్ మాన్‌కైండ్" అని చెప్పిన అమెరికన్ రచయిత జేమ్స్ ఎలెన్ మాటలను ఆచరణలో చూపుతూ, మానవ జీవితం సజావుగా సాగడానికి బాల్యం, యవ్వనదశ చాలా ముఖ్యమని, ఆ దశలలో ఉన్నవారికి సాహిత్యం రాస్తున్నవారు అత్యంత జాగరణతో సాహిత్యాన్ని సృష్టించాల్సిన అవసరం ఉన్నదని నమ్మినవ్యక్తి కనుకనే శివకుమార్ "కబుర్ల దేవత" కథా సంపుటి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారానికి ఎంపికైంది.

‘హర్మ్యాజ్’ మూసివేస్తే ఇబ్బందులే?

- ముడిచమురు ధరలు పెరిగే అవకాశం
- నిపుణుల అంచనా

న్యూఢిల్లీ: ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన క్రమంలో ముడిచమురు రవాణాకు కీలకంగా ఉన్న హర్మ్యాజ్ జలసంధిలో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకుంటే... ప్రపంచ దేశాలతోపాటు భారత్‌పై కూడా ప్రభావం చూపనుంది. అంతర్జాతీయ చమురు వ్యాపారానికి కీలకంగా ఉన్న ఈ జలసంధి.. భారత్ చమురు దిగుమతులకూ అత్యంత ముఖ్యమైంది. తాజా పరిణామాల వేళ దీన్ని మూసివేస్తే భారత దిగుమతులపై ఏమేర ప్రభావం చూపనుందనే విషయంపై చర్చ జరుగుతోంది. ముడిచమురు దిగుమతుల్లో ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్న భారత్ నిత్యం దాదాపు 5.5 మిలియన్ బ్యారెళ్ల ఇంధనం దిగుమతి చేసుకుంటోంది. ఇందులో 2 మిలియన్లు హర్మ్యాజ్‌నుంచే సరఫరా అవుతుంది. అమెరికా దాడుల నేపథ్యంలో ఒకవేళ హర్మ్యాజ్‌ను ఇరాన్ మూసివేసినా కూడా భారత దిగుమతులపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. పశ్చిమాసియా నుంచే కాకుండా రష్యా, అమెరికా, బ్రెజిల్‌ల నుంచి భారత్ ముడి చమురు దిగుమతి చేసుకోవడమే ఇందుకు కారణమంటున్నారు. అయితే ధరలు మాత్రం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఉక్రెయిన్‌పై సైనికచర్యల మొదలుపెట్టిన తర్వాత రష్యా నుంచి భారత్ భారీ స్థాయిలో తక్కువ ధరకు ముడిచమురు దిగుమతి చేసుకుంటోంది. ఒక్క మే నెలలో రష్యా నుంచి 1.96 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు దిగుమతి చేసుకోగా... జూన్‌లో 2-2.2 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకోవచ్చని అంచనా. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్‌ల నుంచి దిగుమతి చేసుకునే దానికంటే ఎక్కువ. అంతేకాదు గత రెండేళ్లలో ఈస్థాయిలో ఇక్కడ నుంచి తీసుకోవడం ఇదే తొలిసారి.

ఇదే సమయంలో అమెరికా నుంచి కూడా భారీగా పెరిగినట్లు అంచనా. భారత్‌కు రష్యా నుంచి ముడిచమురు హర్మ్యాజ్ జలసంధితో సంబంధం లేకుండా సూయజ్ కాలువ, కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గాల్లో సరఫరా అవుతుంది. అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నాయి. గ్యాస్ విషయానికొస్తే... భారత్‌కు ఖతార్ ప్రధాన సరఫరాదారుగా ఉంది. ఆస్ట్రేలియా, రష్యా, అమెరికాల నుంచి వచ్చే ద్రవరూప సహజవాయువు సరఫరాకు ఈ జలసంధితో సంబంధం లేదు. అయితే, పశ్చిమాసియాలో తాజా పరిణామాల వల్ల ముడిచమురు ధరలు మాత్రం పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

హర్మ్యాజ్ జలసంధి ప్రత్యేకత...

హర్మ్యాజ్ జలసంధి పర్షియన్ గల్ఫ్‌ను- గల్ఫ్ ఆఫ్ ఒమన్‌ను అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రాలతో కలుపుతుంది. ఇరుకైన జలసంధి ఇది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన చోక్‌పాయింట్. సౌదీ, ఇరాక్, యూఏఈ, ఖతార్, ఇరాన్, కువైట్, బహ్రెయిన్ దేశాలు ఈ మార్గం నుంచే ముడిచమురును ఎగుమతి చేయాల్సి ఉంటుంది. ప్రపంచ వాణిజ్యం, ఇంధన భద్రతకు కీలకమైన ఈ జలసంధి మార్గాన్ని సురక్షితంగా ఉంచేందుకు అమెరికా, ఫ్రాన్స్, చైనా లాంటి దేశాలు నౌకాదళాలను అక్కడ మోహరిస్తుంటాయి. అమెరికా ఇంధన సమాచార పాలనావిభాగం చెబుతున్న ప్రకారం.. 2024లో ఇక్కడ నుంచి నిత్యం 20.3 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు, 290 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఎల్ఎన్‌జీ సరఫరా జరిగిందని అంచనా.

ఇరాన్ అధ్యక్షుడికి మోదీ ఫోన్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం మధ్యాహ్నం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయిల్-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు, ఇరాన్‌లో ప్రస్తుత పరిస్థితిపై వారు చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ‘ఇరాన్‌లో ప్రస్తుత పరిస్థితిపై మేం వివరంగా చర్చించాం. ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇటీవల మరింత తీవ్రం కావడంపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాను. ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు ఇరుదేశాలు ప్రయత్నించాలని సూచించాను. ఇరుదేశాల్లో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడం కోసం చర్చలు, దౌత్య మార్గాల ద్వారా ముందుకు వెళ్లాలని సలహా ఇచ్చాను’ అని ప్రధాని వెల్లడించారు. కాగా ఇజ్రాయిల్-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకీ పెరుగుతున్నాయి. ఇజ్రాయిల్ తరపున అమెరికా కూడా యుద్ధంలోకి దిగడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. అమెరికా తమపై ప్రత్యక్ష దాడికి దిగడంపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తమపై దాడులు చేస్తున్న అమెరికా తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించింది.

మావోయిస్టుల దుశ్చర్య...
మాజీ మావోయిస్టుతో సహా మరొకరి హత్య

విశాలాంధ్ర-చింతూరు: లొంగిపోయిన మావోయిస్టుతో పాటు ఓ గ్రామస్థుడిని మావోయిస్టులు హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సెండ్రబోర్, యమపూర్ గ్రామాలకు చెందిన సమ్మయ్య, వేకో దేవాలను శనివారం రాత్రి ఆయుధాలతో వచ్చిన మావోయిస్టులు అపహరించారు. వారిద్దరిని పోలీస్ ఇన్ ఫార్మర్ నేపంతో ప్రజా కోర్టు నిర్వహించి దారుణంగా హత్య చేశారు. సమ్మయ్య మావోయిస్టు పార్టీ మాజీ సభ్యుడు. అతడు ఇటీవలే జనజీవన స్రవంతిలో కలిసేందుకు వచ్చి బీజాపూర్ పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయాడు.

సమ్మయ్య, దేవాలు మావోయిస్టు పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారన్న నెపంతో వీరిద్దరిని మావోయిస్టులు హత్య చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పామేడు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వారం రోజుల్లో మావోయిస్టులు ఐదుగురిని హత్య చేశారు.

‘సౌర’పథకంపై వినూత్న సూచనలకు బహుమతులు

కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ వెల్లడి

న్యూఢిల్లీ: సౌర విద్యుత్తు వ్యవస్థను అల్పాదాయ, మధ్యాదాయ కుటుంబాలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన సరికొత్త విధానాల కోసం కేంద్ర ప్రభుత్వం అన్వేషిస్తున్నట్లు కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ వెల్లడించింది. అత్యుత్తమ సూచనలు చేసేవారికి భారీ నజరానాలు ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ పోటీల్లో గెలిచిన వారికి మొదటి బహుమతి కింద రూ.కోటి, రెండో బహుమతి కింద రూ.50 లక్షలు, మూడో బహుమతిగా రూ.30 లక్షలు, ప్రోత్సాహక బహుమతి కింద పది మందికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపింది. రూఫ్‌టాప్ సౌరవిద్యుత్తు పథకాన్ని మరింత మందికి అందుబాటులోకి తేవడం, సుస్థిరంగా మార్చడం, సమ్మిళితం , పర్యావరణ సుస్థిరత అనే నాలుగు అంశాల ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం ఈ పోటీ నిర్వహిస్తోంది. ఔత్సాహికులు, స్టార్టప్‌లు పాల్గొని సమస్యలకు తగిన పరిష్కారాలు చూపి పెద్దమొత్తంలో బహుమతి గెలుచుకొనే అవకాశం కల్పిస్తోంది. ప్రతిభావంతులకు నగదు బహుమతితో పాటు ఇంక్యుబేషన్ సపోర్టు ఇస్తారు. పైలట్ ప్రాజెక్టుల అమలు బాధ్యతను అప్పగిస్తారు. పోటీదారులు స్టార్టప్ ఇండియా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి తేదీ ఆగస్టు 20. తుది ఫలితాలు సెప్టెంబరు 10న వెల్లడిస్తారు.

దోమ సైజులో నిఘా డ్రోన్

సైనిక రహస్యాలకు చైనా సైనిక ల్యాబ్ సృష్టి

న్యూఢిల్లీ: సైనిక కార్యకలాపాలను రహస్యంగా కనిపెట్టేందుకు చైనాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ (ఎన్‌యూడీటీ)కు చెందిన ఓ రోబోటిక్స్ ప్రయోగశాల దోమ పరిమాణంలో ఉన్న ఓ బుల్లి డ్రోన్‌ను తయారుచేసింది. హ్యూమనాయిడ్ మిషన్ల నుంచి కంటికి కనిపించని పరిమాణంలో ఉండే సూక్ష్మ డ్రోన్ల వరకు ప్రయోగశాలలో తాము తయారుచేసిన రోబోలను ఎన్‌యూడీటీ పరిశోధకులు చైనా సెంట్రల్ టెలివిజన్‌కు చెందిన సైనిక చానల్‌లో గత వారాంతంలో ప్రదర్శించారు. దోమంత సైజులో ఉన్న ఓ సూక్ష్మ డ్రోన్‌ను తన చేతివేళ్లలో ఉంచుకుని టీవీ వీక్షకులకు చూపించిన ఓ ఎన్‌యూడీటీ విద్యార్థి ఈ తరహా మైక్రో డ్రోన్లు యుద్ధ రంగంలో శత్రువులకు సంబంధించిన సైనిక రహస్యాలను చిత్రీకరించి తీసుకువస్తుందని చెప్పాడు.

విమానానికి బాంబు బెదిరింపు...

రియాద్‌కు దారి మళ్లింపు

లండన్: బర్మింగ్‌హామ్ నుంచి ఢిల్లీకి బయిలుదేరిన ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు కాల్ రావంతో విమానాన్ని రియాద్‌కు దారి మళ్లించారు. రియాద్ విమానాశ్రయంలో విమానం దిగిన అనంతరం ప్రయాణికులను సురక్షితంగా బయటికి తీసుకెళ్లారు. ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది విమానాన్ని తనిఖీ చేసి బాంబు లేదని తేల్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏఐ -114 నెంబర్ గల ఎయిరిండియా విమానం శనివారం రాత్రి 8.26 గంటలకు బర్మింగ్‌హామ్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. ఆ తర్వాత విమానంలో బాంబు పెట్టినట్లు కాల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ విమానాన్ని అత్యవసరంగా రియాద్‌కు దారి మళ్లించారు.

రాయ్‌పూర్‌లో ఎన్ఎఫ్ఎస్‌యూకు శంకుస్థాపన

రాయ్‌పూర్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్‌లో నిర్మించతలపెట్టిన నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి మాట్లాడుతూ... ఈ రోజు ఛత్తీస్‌గఢ్‌కు చారిత్రాత్మక రోజని సీఎం అన్నారు. దీంతోపాటు కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి హోంమంత్రి అమిత్ షా సమక్షంలో శంకుస్థాపన జరిగిందని సీఎం చెప్పారు. రాష్ట్రానికి ఇవి రెండు బహుమతులని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఇక, అమిత్ షా తన రెండు రోజుల పర్యటనలో భాగంగా భద్రతా సంబంధిత అంశాలపై నవ రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)తోపాటు, పొరుగు రాష్ట్రాల ఏడీజీపీలతో సమావేశం నిర్వహిస్తారు.

పహల్గాం ఉగ్రదాడి కేసులో ఇద్దరి అరెస్ట్

న్యూఢిల్లీ : పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారనే ఆరోపణలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిందని ఎన్ఐఏ అధికారులను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ ఆదివారం తెలిపింది. ఏప్రిల్ 22న జరిగిన దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా, అరెస్టు చేయబడిన ఇద్దరు నిందితులు... పహల్గాంలోని బాల్‌కోట్‌కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, పహల్గాంలోని హిల్ పార్క్‌కు చెందిన బషీర్ అహ్మద్ జోథర్‌గా తెలుస్తోంది. దాడిలో పాల్గొన్న ముగ్గురు సాయుధ ఉగ్రవాదుల గుర్తింపులను వెల్లడించారని, వారు నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కి అనుబంధంగా ఉన్న పాకిస్థానీ పౌరులని కూడా నిర్ధారించారని ఏఎన్ఐ తెలిపింది. ‘దాడికి ముందు పర్వైజ్, బషీర్ హిల్ పార్క్‌లోని సీజనల్ ధోక్ (గుడిసె) లో ముగ్గురు సాయుధ ఉగ్రవాదులకు తెలిసి ఆశ్రయం కల్పించాచారు’ అని ఎన్ఐఏ తన దర్యాప్తులను ఉటంకిస్తూ తెలిపింది. ఈ ఇద్దరు వ్యక్తులు ఉగ్రవాదులకు ఆహారం, ఆశ్రయం, రవాణా సదుపాయాలను అందించారు. వారు ఉగ్ర దాడి రోజు మధ్యాహ్నం, పర్యాటకులను వారి మతపరమైన గుర్తింపు ఆధారంగా ఎంపిక చేసి చంపారు. ఇది ఇప్పటివరకు జరిగిన అత్యంత భయంకరమైన ఉగ్రవాద దాడులలో ఒకటిగా మారింది’ అని వివరించింది. ఎన్ఐఏ ఈ సంఘటన గురించి పోనీవాలాస్‌తో సహా అనేక మంది స్థానిక ప్రత్యక్ష సాక్షులను ప్రశ్నించిన తర్వాత ఈ అరెస్టులు జరిగాయి. 2 వేల మందికి పైగా వ్యక్తులను విచారించారు. ప్రశ్నించిన కొంతమందిపై ప్రజా భద్రతా చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు. ఎన్ఐఏతో పాటు జమ్మూకశ్మీర్ పోలీసులు 100 మందికి పైగా ఉగ్రవాద సహచరుల ఇళ్లపై కూడా దాడులు చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల బంధువులను, ప్రాణాలతో బయటపడిన వారిని కూడా ఎన్ఐఏ ప్రశ్నించింది. ఉగ్రవాదుల గురించి జాతీయ దర్యాప్తు సంస్థ అనేక ముఖ్యమైన విషయాలు తెలుసుకుందని, ఉన్నతాధికారులతో కూడిన ఎన్ఐఏ బృందాలు ఈ సంఘటనపై దర్యాప్తులో నిమగ్నమై ఉన్నాయని ఎన్ఐఏ అధికారి ఒకరు తెలిపారు. కాగా, లష్కరే తోయిబా (ఎల్ఈటీ) అనుబంధ సంస్థ అయిన రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) పహల్గాం లో దాడి చేసింది తామేనని ప్రకటించిన విషయం తెలిసిందే. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం-1967లోని సెక్షన్ 19 కింద ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన ఎన్ఐఏ ఏప్రిల్ 22, 2025న ప్రపంచాన్ని కుదిపేసిన దాడి తర్వాత నమోదు చేయబడిన కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తోంది

ఉగ్రవాద సంబంధిత ప్రాంగణాలపై ఎన్ఐఏ దాడులు

షోపియన్, కుల్గాం, పుల్వామా, సోపోర్, కుప్వారాతో సహా కశ్మీర్‌లోని 32 ప్రదేశాలలో ఎన్ఐఏ దాడులు నిర్వహించిన రెండు వారాల తర్వాత ఈ పరిణామం జరిగింది. ఇవి పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద గ్రూపులతో సంబంధాలున్న అనేక మందికి చెందినవని ఈ పరిణామాలతో పరిచయం ఉన్న వ్యక్తులు తెలిపారు. జమ్మూకశ్మీర్ పోలీసు దళాలు, కేంద్ర సాయుధ దళాల సహాయంతో ఎన్ఐఏ ఈ దాడులు నిర్వహించిందని వారు చెప్పారు. పహల్గాం ఉగ్రవాద దాడికి సంబంధించి ఈ దాడులు స్పష్టంగా పేర్కొనబడనప్పటికీ, రెండేళ్ల క్రితం దాఖలయిన కేసులో నిషేధిత ఉగ్రవాద సంస్థలు, వాటి అనుబంధ సంస్థలపై ఎన్ఐఏ చేపట్టిన అణిచివేత చర్యలో ఇది భాగం.

ఉగ్రవాదులు ఎవరో తెలుసుకుంటాం

ఎన్ఐఏ అరెస్టులపై ఫరూఖ్ అబ్దుల్లా



ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దారుణ దాడికి సంబంధించిన కేసులో ఎన్ఐఏ అరెస్టులను జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా ఆదివారం స్వాగతించారు. ఏఎన్ఐ వార్తా సంస్థతో అబ్దుల్లా మాట్లాడుతూ ‘వారు (ఉగ్రవాదులు) ఎవరో, వారు ఎక్కడి నుంచి వచ్చారో ఇప్పుడు మేము వారి నుంచి కనుగొంటాము. వారు వారిని సరిగ్గా పట్టుకుంటే, పహల్గాం దాడి చేసిన వారిని క్రమంగా చేరుకోవడం మాకు చాలా మంచి విషయం’ అని తెలిపారు. పహల్గాం దాడికి భద్రతా లోపాలే కారణమని ఆయన కేంద్రంపై విమర్శలు గుప్పించారు.

రాష్ట్ర హోదా పునరుద్ధరణలో జాప్యం చేస్తే సుప్రీంను ఆశ్రయిస్తాం

జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణలో జాప్యానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టును ఆశ్రయిస్తానని ఫరూక్ అబ్దుల్లా హెచ్చరించారు. కొత్త ప్రభుత్వం నుంచి ప్రజలు గొప్ప అంచనాలు పెట్టుకున్నారని ఫరూఖ్ అన్నారు. ‘ఎన్నికల తర్వాత వెంటనే తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలు కోరుకున్నారు, కానీ రాష్ట్ర హోదా (పునరుద్ధరణ కాదు) మమ్మల్ని ఆపుతోంది’ అని పార్టీ కార్యకర్తలతో సమావేశం తర్వాత కోకర్నాగ్‌లో విలేకరులతో ఆయన అన్నారు. ‘వారు (ఎన్‌సీ ఎమ్మెల్యే అల్తాఫ్ కలూ) మంత్రి కావాలని కోరుకుంటున్నట్లు చాలా డిమాండ్లు ఉన్నాయి. కానీ రాష్ట్ర హోదా పునరుద్ధరించబడే వరకు ఇది ఎలా సాధ్యమవుతుంది?’ అని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. ‘రాష్ట్ర హోదా లేకపోవడం ప్రభుత్వంపై చాలా అడ్డంకులను కలిగిస్తుంది. మంత్రిత్వ శాఖను విస్తరించే అధికారం కూడా ఉంది. ‘మేము వేచి ఉన్నాము. కానీ వారు చాలా సమయం తీసుకుంటే, మేము సుప్రీం కోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది’ అని చెప్పారు.

రఘువంశీ హత్య కేసులో కీలక పరిణామం

ప్రాపర్టీ డీలర్ అరెస్ట్

షిల్లాంగ్: సంచలనం సృష్టించిన హనీమూన్ హత్య కేసులో షిల్లాంగ్ పోలీసులు కీలక వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇండోర్‌కు చెందిన ప్రాపర్టీ డీలర్ సిలోమ్ జేమ్స్‌ను శనివారం రాత్రి మహాలక్ష్మి నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. రాజా రఘువంశీ, అతని సహచరి సోనమ్ ఉపయోగించిన ఫ్లాట్ నుంచి విలువైన వస్తువులు, నగదు తరలించడంలో జేమ్స్ పాత్ర ఉందని పోలీసులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే, రాజా రఘువంశీ హత్య అనంతరం, అతని ఫ్లాట్ నుంచి ఒక పిస్టల్, సుమారు 5 లక్షల రూపాయల నగదు, బట్టలు, బంగారు ఆభరణాలు మాయమైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ వస్తువులను సిలోమ్ జేమ్స్ దొంగిలించాడని, అతనికి మరో సెక్యూరిటీ గార్డు కూడా సహకరించాడని పోలీసులు తెలిపారు. ఆ సెక్యూరిటీ గార్డును కూడా అరెస్ట్ చేసినట్లు ఆదివారం వెల్లడించారు. వీరిద్దరినీ ఈ కేసులో సహ నిందితులుగా చేర్చనున్నట్లు తెలిసింది. "సిలోమ్ జేమ్స్‌ను మహాలక్ష్మి నగర్‌లో షిల్లాంగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రాత్రి అతనికి వైద్య పరీక్షలు నిర్వహించామని... కోర్టులో హాజరుపరిచి, ట్రాన్సిట్ రిమాండ్‌పై షిల్లాంగ్‌కు తరలిస్తామని అదనపు డీసీపీ రాజేష్ దండోతియా తెలిపారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గత ఐదు రోజులుగా ఇండోర్‌లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తోంది. జేమ్స్ ఇంటిపై కూడా సిట్ అధికారులు దాడి చేసి, అతడిని ఎంవై ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. కాగా సోనమ్ అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ఉపయోగించిన అద్దె ఫ్లాట్‌పై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఈ ఫ్లాట్‌లో దాచిన ఒక బ్యాగులో దేశవాళీ పిస్టల్, బట్టల్లో చుట్టిన నగదు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, జూన్ 13న సిలోమ్ జేమ్స్ మీడియా ముందుకు వచ్చి, నిందితుల్లో ఒకడైన విశాల్‌ను వార్తా ఫుటేజీలో చూసి గుర్తుపట్టినట్లు చెప్పాడు. అయితే, జూన్ 10న జేమ్స్ తన కారులో ఫ్లాట్ నుంచి ఒక బ్యాగును తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయని సిట్ అధికారులు గుర్తించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే, అతను ఆ భవనంలో సెక్యూరిటీ కెమెరాలను ఏర్పాటు చేయడం కూడా కనిపించిందని, ఇది తన చర్యలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమే అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ ఫ్లాట్‌ను మొదట జేమ్స్, రాజా సహచరుడైన విశాల్ పేరు మీద నెలకు 17,000 రూపాయలకు అద్దెకు తీసుకున్నాడు. తర్వాత సోనమ్ ఇండోర్‌కు తిరిగి వచ్చి ఈ ఫ్లాట్‌లోనే ఉంది. నగరంలో కొన్ని అరెస్టులు జరిగిన తర్వాత, సోనమ్ జూన్ 8న ఘాజీపూర్‌కు వెళ్లినట్లు, ఆ బ్యాగును ఫ్లాట్‌లోనే వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది. రెండు రోజుల తర్వాత, జూన్ 10న, జేమ్స్ నకిలీ తాళం చెవి ఉపయోగించి ఫ్లాట్‌లోకి ప్రవేశించి బ్యాగులు, బట్టలు, ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను తీసుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసులో జేమ్స్‌ను సహ నిందితుడిగా చేర్చి దర్యాప్తు చేస్తున్నారు.

లాలూ... బీహార్ గబ్బర్ సింగ్

పాట్నా : ఆర్‌జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌పై బీహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత సామ్రాట్ చౌదరి తీవస్థాయిలో విరుచుకుపడారు. లాలూను బీహార్ గబ్బర్‌సింగ్ (షోలే చిత్రంలో విలన్), అవినీతికి ప్రతీకగా ఆయన అభివర్ణించారు. ఈ ఏడాది చివరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అవమానకరమైన రీతిలో ఆయన ఓటమి ఎదుర్కోక తప్పదని జోస్యం చెప్పారు. ‘లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్ గబ్బర్ సింగ్. రాజకీయాల్లో ఆయన చురుగ్గా ఉన్నంత వరకు ప్రజలు ఆయనకు భయపడుతూనే ఉంటారు. ఆయన అవినీతికి ప్రతీక అని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ఆర్‌జేడీ నేరస్తులతో నిండిపోయింది. లాలూ కుటుంబం అవినీతిపరులతో నిండిపోయింది’ అని సామ్రాట్ ఆరోపించారు.

ట్రంప్‌నకు నోబెల్ పురస్కారమా?

పాక్ సిఫార్స్‌పై ఒవైసీ ఆగ్రహం

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతి పురస్కారానికి పాకిస్థాన్ సిఫారసు చేయడంపై ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య వివాదంలో అమెరికా ప్రవేశించడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాకిస్థాన్ ట్రంప్‌ను శాంతి పురస్కారానికి సిఫార్సు చేసింది అందుకేనా అంటూ ప్రశ్నించారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అమెరికా అధ్యక్షుడితో భోజనం చేసింది అందుకేనా... అవన్నీ నేడు బహిర్గతమయ్యాయని వ్యాఖ్యానించారు. ఇరాన్ అణుస్థావరాలపై అమెరికా దాడి చేయడాన్ని ఖండించారు. ఇది అంతర్జాతీయ చట్టం, యూఎన్ చార్టర్‌ను ఉల్లంఘించడమేనన్నారు. ఇలా చేయడం ద్వారా రాబోయే ఐదేళ్లలో ఇరాన్ అణ్వస్త్ర దేశంగా మారుతుందని తాను అనుకుంటున్నానన్నారు. చాలా గల్ఫ్ దేశాలు తమకు అణ్వాయుధ సామర్థ్యం అవసరమని భావిస్తున్నాయన్నారు. 16 మిలియన్లకుపైగా భారతీయులు గల్ఫ్, మధ్యప్రాచ్యంలో నివసిస్తున్నారని మనం గుర్తుంచుకోవాలన్నారు. దురదృష్టవశాత్తు ఆ ప్రాంతంలో యుద్ధం జరిగితే అక్కడ నివసిస్తున్న భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయనేది కేవలం పుకారేనన్నారు. అమెరికా చేసిన ఈ దాడి పలస్తీనియన్లను ఊచకోత కోస్తున్న నెతన్యాహుకు సహాయపడిందని ఒవైసీ విమర్శించారు. గాజాలో జాతి విధ్వంసం జరుగుతోందని... అమెరికా దాని గురించి ఆందోళన చెందడం లేదని... ఇజ్రాయిల్ ప్రభుత్వ నేరాలను దాచడమే అమెరికా విధానమన్నారు. ఇజ్రాయిల్‌లో ఎన్ని అణు నిల్వలు ఉన్నాయో ఎవరూ ఎందుకు అడగడం లేదు అని ప్రశ్నించారు. అంతర్జాతీయ చట్టాన్ని, యూఎన్ చార్టర్‌ను ఉల్లంఘించే అమెరికా ఈ ఏకపక్ష బాంబు దాడిని భారత ప్రభుత్వం ఖండిస్తుందని తాను ఆశిస్తున్నానన్నారు.

ఇజ్రాయిల్ నుంచి భారతీయుల తరలింపు

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్‌లో ఉంటూ స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులను వెనక్కి తెచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్టు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) ప్రకటించింది. ముందుగా ఇజ్రాయిల్ నుంచి భూ సరిహద్దుల ద్వారా, తరువాత భారత్‌కు వాయుమార్గం ద్వారా ప్రయాణ సౌకర్యం కలిస్తామని తెలిపింది. ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య దాడులు, అమెరికా సైతం ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై తాజాగా దాడులు చేయడంతో మధ్యప్రాచ్యంలో యుద్ధం మరింత తీవ్రమైంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఇరాన్ నుంచి ‘ఆపరేషన్ సింధు’ పేరుతో భారతీయులను వెనక్కి తీసుకువచ్చిన భారత ప్రభుత్వం ఇప్పుడు ఈ ఆపరేషన్‌ను ఇజ్రాయిల్ కూడా విస్తరించింది. భారత్ చేరుకోవాలనుకునే వారు టెల్ అవివ్‌లోని రాయబార కార్యాలయంలో తమ పేర్లు రిజిస్టర్ చేయించుకోవాలని ఎంఈఏ సూచించింది.

ఇప్పటికీ రిజిస్టర్ చేయించుకోని వారు అధికారిక పోర్టల్ www.indembassyisrael.gov.in/indian_national_regలో రిజిస్టర్ చేయించుకోవాలని కోరింది. 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 972 54-7520711, 972 54-3278392 నెంబర్లలో సంప్రదించాలని, ఇ-మెయిల్ హెల్ప్‌లైన్ cons1.telaviv@mea.gov.in కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇజ్రాయిల్‌లో సుమారు 18,000 మంది భారతీయులు ఉంటున్నారు.

ఇరాన్ నుంచి మరో 311మంది భారతీయుల రాక

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్‌తో యుద్ధం కొనసాగుతుండటంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది. భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధులో భాగంగా 311 మంది భారతీయులతో మహాన్ విమానం (డబ్ల్యు50071ఏ) సురక్షితంగా ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం చేరుకుంది. వీరిలో ఎక్కువమంది ఇరాన్‌లో చదువుకునేందుకు వెళ్లిన విద్యార్థులే ఉండగా, ఇందులోనూ 200 మంది వరకూ కశ్మీర్ విద్యార్థులు ఉన్నారు. ఇరాన్ అణుస్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా వైమానిక దాడులు జరిన నేపథ్యంలో ఆ దేశంలో ఉద్రిక్తతలు మరింత పెరిగిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

భారత ప్రభుత్వానికి జమ్మూకశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలియజేసింది. ఇరాన్‌లో అత్యంత క్లిష్ట పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత్, ఇరాన్ అధికారులు చక్కటి సమన్వయంతో పనిచేయడాన్ని అసోసియేషన్ ప్రశంసించింది. కాగా, ఇంతవరకూ ఇరాన్ నుంచి సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చిన భారతీయుల సంఖ్య 1428 మందికి చేరినట్టు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

విశాలాంధ్ర హైదరాబాద్

నేడు సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లిలో అప్రెంటీస్‌షిప్, జాబ్ మేళా

విశాలాంధ్ర - హైదరాబాద్ : వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్, జాబ్ మేళా సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 23న (సోమవారం) నిర్వహిస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యాధికారి డి.ఒడ్డన్న తెలిపారు. ఇందులో పారా మెడికల్ నాన్ పారామెడికల్ సంబంధించి సుమారు 164 కంపెనీలు పాల్గొంటున్నాయి. అందులో 3153 వేకెన్సీలు ఉన్నాయి. గడిచిన మూడు సంవత్సరాల్లో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు పాల్గొనడానికి అర్హులు. దీని గురించి కళాశాలల యాజమాన్యాలు ప్రిన్సిపల్స్, లెక్చరర్స్ వారికి సంబంధించిన విద్యార్థులకు తెలియజేయాలని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికి సంబంధించి రోజు సంబంధిత ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఏర్పాట్లపై డిఐఈఓ సమీక్షించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

సంతోష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సంతోష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి.బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులుగా జి.రాము, ప్రధాన కార్యదర్శిగా ఎన్.నరసింహారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.కృష్ణ, కోశాధికారి మహేష్, శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ జి.నవీన్, అడ్వైసర్ ఎస్.ఎన్.నాగభూషణం, వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయనున్నట్లు వారు తెలిపారు. కాలనీ అన్ని రంగాల్లో రాణించే విధంగా పాటుపడనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : కొలను

విశాలాంధ్ర - దుండిగల్ : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ 2వ డివిజన్ పరిధిలో సీసీ రోడ్, వీధి దీపాలు, పలు అభివృద్ధి లేక కాలనీ వాసులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటూ గత నెల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని సంప్రదించి సమస్యను విన్నవించగా వెంటనే సానుకూలంగా స్పందించి మున్సిపల్ కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్, వీధి దీపాలు, పలు అభివృద్ధి పనులను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో నిర్వహించిన శంకుస్థాపన పనుల కార్యక్రమానికి నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వారి చేతుల మీద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎమ్ సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మహిళ జనరల్ సెక్రటరీ రఫియా బేగమ్, డివిజన్ అధ్యక్షులు వీరబాబు, కొలన్ జీవన్‌రెడ్డి, అంబారెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - అమనగల్లు: ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బస్టాండ్ స్కూల్) లో 2013 - 2014 పదవ తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణ కేంద్రంలోని కళ్యాణి గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు.పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా ఒకచోట కలిశారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా 13 సంవత్సరాల అనంతరం ఒకచోట కలిసిన సందర్భం అనిర్వచనీయం. పాత మిత్రులందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందంగా పాత రోజులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు శశిరెడ్డి, మహాలింగం, కురుమూర్తి, ఉమారాణి, సుశీల, జాస్మిన్ లను ఘనంగా సత్కరించి, పాదాభివందనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివ, నర్సింహా, ప్రదీప్, మౌనిక, శ్రీరామ్, మహేందర్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

ఆర్ అండ్ బి శాఖ పరిధిలో కొనసాగుతున్న

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆర్ అండ్ బి శాఖ పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం డా.బి.ఆర్ అంబేడ్కర్ తెలంగాణ సెక్రటేరియట్‌లో ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రోడ్లు భవనాలు శాఖపై బృహత్తర బాధ్యత ఉందని దాన్ని దృష్టిలో పెట్టుకొని త్వరగా పూర్తయి వాడుకలోకి వచ్చే వాటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనీ అధికారులకు ఈ సందర్భంగా ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఐదు జిల్లాల సమీకృత కార్యాలయాలు ఆదిలాబాద్, వరంగల్, ములుగు, నారాయణపేట, కరీంనగర్ పనుల పురోగతిపై మంత్రి ఆరా తీయగా పెండింగ్ బిల్లుల అంశం అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వర్క్ ఫినిషింగ్ స్టేజ్‌లో ఉన్న వరంగల్, ములుగుజిల్లా కలెక్టరేట్లు వెంటనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు. ఆర్వోబిల నిర్మాణంపై ఆరా తీసిన మంత్రి నిజామాబాద్ మాధవనగర్ ఆర్వోబి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణం చివరి దశలో ఉన్న ఆర్వోబిలు, మెడికల్ కాలేజీలు, టిమ్స్ హాస్పిటల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మంచి రోడ్లు ఉంటే రవాణా సౌకర్యం పెరుగుతుంది. అది అభివృద్ధికి సూచిక అవుతుందన్నారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లో 91 లక్షల వెహికిల్ మూమెంట్ ఉందని, రూరల్ తెలంగాణలో అదే స్థాయిలో ఉంటుందని అందుకు మంచి రోడ్లు ఉండాలని, ప్రజలకు ప్రధానంగా కావాల్సింది సౌకర్యవంతమైన రోడ్లను గుర్తెరిగి పని చేయాలన్నారు. వర్క్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి క్లియర్ చేయిస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఈఎన్సీ తిరుమల, చీఫ్ ఇంజనీర్లు మోహన్ నాయక్, రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలి : ఎస్‌టియుటిఎస్

విశాలాంధ్ర - అమనగల్లు : ఉపాధ్యాయ సమస్యలపై ఎస్ టి యు టి ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సదానందం గౌడ్ తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులతో సంఘాలతో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్టియు టీఎస్ కార్యాలయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, ఆమనగల్లు పూర్వపు సమితి ఎస్ టి యు టి ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కలిసి సదానందం గౌడ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతకుముందు కార్యాలయం ఎదుట ఎస్ టి యు టి ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి సదానందం గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని సదానందం గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు, పి ఆర్ సి ని, పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలని లేనియెడల ఉపాధ్యాయ సంఘంతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్‌టియుటిఎస్ ఉపాధ్యాయ సంఘానికి విశేష సేవలు అందించిన, పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులకు అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాపికలను అందించి పూలమాలలు, శాలువాలు ఘనంగా సత్కరించి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పూర్వ ఉపాధ్యాయ శాసనసభ్యులు కత్తి శ్రీను, నర్సింహారెడ్డి, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి, సీనియర్ సభ్యులు రంగారెడ్డి జిల్లా ఎస్ టి యు టి ఎస్ పూర్వ ప్రధాన కార్యదర్శి కశిరెడ్డి పురుషోత్తం రెడ్డి, నక్కర కంటి పరమేశ, పున్న గణేష్, రాష్ట్ర బాధ్యులు సుధాకర్, కృష్ణారెడ్డి, భార్గవి, ఆమనగల్ మండలం అధ్యక్షులు కసిరెడ్డి అశోక్ రెడ్డి మాడుగుల మండలం అధ్యక్షులు నవీన్ తలకొండపల్లి అధ్యక్షులు క్రాంతి కుమార్ మండల అధ్యక్షులు అబ్దుల్ రజాక్ ఆమనగల్లు మండల ప్రధాన కార్యదర్శి శ్రీలత సుజాత, రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, జీవనశైలిని అభివృద్ధి చేయాలి

కలెక్టర్ హరి చందన చేతుల మీదుగా ఎన్.ఎస్.పి.సి.2025 పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలో నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ (ఎన్.ఎస్.పి.సి) 2025 పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ఆవిష్కరించారు. వాతావరణ మార్పుల పర్యవసానాల నుండి రక్షణకు విద్యార్థులలో పర్యావరణ నైపుణ్యాలు, జీవనశైలిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. మొక్కలు నాటటం, నీటి సంరక్షణ, వ్యర్థాల వేరుచేసే అలవాట్లను విద్యార్థులలో అలవరచాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్ కోర్ తయారు చేసిన పోస్టర్‌ని విడుదల చేసి జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలోని అన్ని విద్యా సంస్థలు ఈ పోటీలో పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు. హరిత్ ది వే ఆఫ్ లైఫ్ అనే థీమ్‌పై దేశ వ్యాప్తంగా ఎన్.ఎస్.పి.సి పోటీని పర్యావరణ సంరక్షణ గతి విధి నిర్వహిస్తోంది. ఈ పోటీకి జూలై 1 నుండి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుంది. ఈ పోటీకి కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహాయ సహకారం ఉంది. ఫలితాలు ఆగస్టు 30న ప్రకటించబడతాయి. 1వ తరగతి నుండి పరిశోధన విద్యార్థుల వరకు ఐదు విభాగాలలో పోటీ నిర్వహించబడుతుంది. ఎకో మిత్రం యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. హిందీ, ఇంగ్లీష్, మరిన్ని భాషలలో క్విజ్ పోటీలు నిర్వహిస్తారన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు లేదన్నారు. మొక్క నాటుతున్న, నీరు సేవ్ చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీ అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. గత సంవత్సరాలలో లక్షలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఎన్.ఎస్.పి.సి పోటీలో ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో విద్యార్థుల భాగస్వామ్యం చేయాలని భావిస్తున్నారు. అన్ని విద్యా సంస్థల ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని, 1వ తరగతి నుండి 5వ తరగతి, 6వ తరగతి నుండి 8వ తరగతి, 9వ తరగతి నుండి 12వ తరగతి, డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు, ఇంతే కాక ఇతరులు సామాన్య పౌరులు కూడా పాల్గొనవచ్చు. పోటీలో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి ఈ-సర్టిఫికెట్ లభిస్తుంది. విద్యా సంస్థలకూ ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుందని తెలిపారు.

రోడ్డు విస్తరణకు శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ నుండి అమీన్ పూర్ వరకు రూ. 45 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే రోడ్డును ఈనెల 25న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. దీంతో సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి పనులను గాంధీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శ్రీదేవి థియేటర్ నుండి అమీన్ పూర్ వరకు రూ. 45 కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే రోడ్డును బుధవారం ఉదయం 10.00 మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరుగుతుంది అని, ఏర్పాట్లను పరిశీలించడం జరిగినది అని, రోడ్డు విస్తరణ పనులుపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించడం జరిగినది అని, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కితీసుకువస్తామని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. చుట్టుపక్కల కాలనీ వాసులకు, ప్రజలకు సాంత్వన చేకూరేల పనులు చేపడుతామని, ఎన్నో ఏండ్ల సమస్య త్వరలోనే తీరునని, ప్రజల సౌకర్యార్థం, ప్రజావసరాల దృష్ట్యా శ్రీదేవి థియేటర్ నుండి అమీన్ పూర్ వరకు రోడ్డు త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుంది అని, రద్దీ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం అన్ని హంగులతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని, రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, రోడ్డు విస్తరణ వలన ట్రాఫిక్ తగ్గి, సమయం, వాహనాల ఇంధనం తగ్గునని, ప్రజలకు కొంత సాంత్వన చేకూరునని అన్నారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది. రద్దీ ప్రాంతాలలో ట్రాఫిక్ తగ్గించడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసి అనేక ఫ్లై ఓవర్‌లు, రోడ్లు,లింక్ రోడ్లు పూర్తి చేశామని గాంధీ తెలియచేసారు. అదేవిదంగా మెరుగైన జీవన ప్రమాణాల కోసం, ట్రాఫిక్ రహిత సమాజం కోసం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గతంలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోకూడా అధికారులు చక్కటి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకొని, ఎక్కడ పనులు ఆపకుండా ఎన్నో స్థల సేకరణ చేయాల్సి ఉన్నప్పటికీ కూడా ప్రజల సహకారం తీసుకొని అధికారులను సమన్వయ పర్చుకుంటూ ఇన్ని రోడ్లు అభివృద్ధి చేయడం అంటే బహుశా 50 యేండ్ల చరిత్రలో ఇది మొట్టమొదటి సరిగా గొప్ప చరిత్ర అని చెప్పుకోవడానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజానీకానికి, మాకు గౌరవంగా ఉందని చెప్పడానికి చాల సంతోషిస్తున్నాను అని, అదేవిధంగా బ్రహ్మాండంగా ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, కొత్త రోడ్లు వేయడం జరిగినది. ప్రత్యామ్నాయ రోడ్లు అడగడం జరిగినది అని వీటిని ప్రత్యేకంగా తీసుకోని నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల ట్రాఫిక్ సమస్యల ఇబ్బందులను గట్టెకించే విధంగా కృషి చేస్తామని గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘుపతి రెడ్డి,నాగిరెడ్డి, మహిపాల్, ప్రసాద్, సందీప్ రెడ్డి, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీల వాసులు పాల్గొన్నారు.

క్యాన్సర్ కేర్ సిస్టంకు పూర్తి సహకారం

సీఎంను కలిసిన ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ప్రముఖ ఆంకాలజిస్ట్, పద్మశ్రీ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. అదివారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసిన డా.దత్తాత్రేయుడు విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ, కృషిని అభినందించారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధిలో ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.

మహిళలను బైక్ రైడింగ్ నైపుణ్యాలతో సన్నద్ధం చేస్తున్న 'ఆర్ బీ ఫర్ ఉమెన్'

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశంలోని ప్రముఖ బైక్ అద్దె వేదిక అయిన రాయల్ బ్రదర్స్ ఆధ్వర్యంలో జపాన్‌కు చెందిన యమహా మోటార్ కో లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన మోటో బిజినెస్ సర్వీస్ ఇండియా సహకారంతో వారి ప్రతిష్టాత్మక ఆర్ బీ ఫర్ ఉమెన్ ప్రోగ్రామ్ 11వ ఎడిషన్‌లో భాగంగా మూడవసారి హైదరాబాద్‌లో నిర్వహించింది. నగరంలోని సురక్షితమైన, నియంత్రిత స్థలం అయిన హాస్టెన్ గో కార్టింగ్ జోన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రొఫెషనల్ ట్రైనింగ్ వర్క్‌షాప్‌లో 120 మందికి పైగా మహిళలకు అవసరమైన స్కూటర్, మోటార్‌సైకిల్ రైడింగ్ నైపుణ్యాలతో సాధికారత కల్పించింది. ఈ వర్క్ షాప్ మహిళలకు వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని అందించడమే కాకుండా ఉత్తేజకరమైన అవకాశాలను కల్పిస్తుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ వయసులు, వృత్తులు, నేపథ్యాల నుండి వచ్చిన 600 మందికి పైగా మహిళలకు బైక్ మొబిలిటీ పట్ల ఆసక్తిని, ఇష్టాన్ని పెంపొందించింది. ఆర్ బీ ఫర్ ఉమెన్ సమగ్రంగా వృత్తిపరంగా నడిపించే శిక్షణ అనుభవాన్ని అందిస్తుంది. "ప్రపంచ మోటార్‌సైకిల్ దినోత్సవం నాడు, మార్పు, పరివర్తన కలిగించే 'ఆర్ బీ ఫర్ ఉమెన్' కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు 3వ సారి తీసుకురావడం పట్ల తాము సంతోషిస్తున్నామని రాయల్ బ్రదర్స్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ అభిషేక్ చంద్రశేఖర్ అన్నారు. అనంతరం ఎంబిఎస్ఐ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ 'నకావో హిరోషి' మాట్లాడుతూ సుస్థిరమైన మొబిలిటీ పరిష్కారాలను సులభంగా చేరుకోవడం ద్వారా భారతదేశం అంతటా ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడం ఎంబిఎస్ఐ ప్రధాన దార్శనికత" అని అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు పరచాలని బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలో బీసీ సేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటి అధ్యక్షులుగా చాకలి శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా గడీల మైపాల్, ప్రధాన కార్యదర్శిగా కావలి మల్లేష్‌లను నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జూపు సుధాకర్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీలు సామాజికంగా విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించాలంటే గ్రామస్థాయి నుంచి బీసీల ఐక్యత చాలా అవసరం అన్నారు. బీసీలకు అండగా ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బర్క కృష్ణ నేపథ్యంలో గ్రామస్థాయి నుంచి బీసీలను బలోపేతం చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ అమలుచేసి ఎన్నికలు జరపాలన్నారు. లేనిపక్షంలో బీసీ సేన ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి సేన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని సన్మానించిన సీఐ

విశాలాంధ్ర - మేడిపల్లి: జర్నలిస్టులు సమాజంలో నిజానిజాలు తెలుసుకోవడానికి ఎంతో కృషి చేస్తారని, సమాజంలో వారి పాత్ర ఎంతో కీలకమని మేడిపల్లి ఇన్స్పెక్టర్ గొవింద్ రెడ్డి కొనియాడారు. ఆదివారం ఉదయం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం మేడిపల్లి ఇన్స్పెక్టర్ గొవింద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్డేమాన్ సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్, మాజీ అధ్యక్షుడు కల్వారి ఎల్లయ్య, మాజీ కోశాధికారి ననుబోతు రాము యాదవ్ లను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. విధి నిర్వహణలో పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చింత రమేష్, గుండ్ల కుమారస్వామి, నాగిరెడ్డి, శేరి కరుణాకర్ రెడ్డి, మరాటి మత్స్యగిరి, చిన్నం మధు తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల విషయంలో వెనక్కి తగేదే లేదు

ఫోన్ ట్యాపింగ్ దేశచరిత్రలో నీచమైన చరిత్ర

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ప్రజాపాలనలో 17లక్షల కొత్త రేషన్ కార్డులు

కేసీఆర్ పాలనలో రాష్ట్రానికి మిగిలింది అప్పుల భారమే

నిజామాబాద్‌లో డబ్బుల్ బెడ్‌రూం పత్రాలను అందచేసిన మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకుందని ఈ విషయంలో వెనక్కు తగ్గే ఆలోచన ప్రభుత్వానికి లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని అయన పేర్కొన్నారు. రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాల విషయంలో కాంగ్రెస్ చాలా స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతుందని చెప్పారు. అదే సమయంలో పొరుగు రాష్ట్రాలతో సఖ్యతతో ముందుకు సాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, కావున బనకచర్ల విషయంలో కూడా చర్చల ద్వారా సమస్య పరిష్కారం అయితే మంచిది లేదా న్యాయంగా తేల్చుకుంటామని అయన వెల్లడిరచారు. నిమాజాబాద్ జిల్లాలో పర్యటించిన అయన ముందుగా డబ్బుల్ బెడ్ రూం పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్దిదారులకు అయన డబ్బుల్ బెడ్ రూం పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ అనేక నీచమైన కార్యక్రమాలు చేసిందని అందులో ఒక్కటే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంగా పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది అతిపెద్ద నేరం అని ఇంతటి నీచమైన చరిత్ర బీఆర్ఎస్ పార్టీకి ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులతో పాటు జడ్జిలు, జర్నలిస్టులతో పాటు స్వంత పార్టీ నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. చివరకు మహిళల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేయించారంటే ఇంతకంటే దిగజారుడు మరోటి ఉండదన్నారు. ప్రజా ఆశీర్వాదంతో ఏడాదిన్నరలో కాంగ్రెస్ పాలన విజయవంతంగా పూర్తి చేసుకుందని, దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల సిద్ధాంతంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఆర్థిక నిర్బంధమున్న ఉచిత బస్సు ప్రయాణం నుంచి సన్న బియ్యం వరకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ దశ దిశా లేకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందని, కేసీఆర్ పాలనలో రాష్ట్రానికి మిగిలింది అప్పుల భారం మాత్రమే అని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో కేసిఆర్ ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని కాని ప్రజాపాలనలో 17 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నట్లు వెల్లడిరచారు. డబుల్ బెడ్ రూమ్ వాగ్దానం చేసిన కేసీఆర్ ఒక్క ఇల్లు ఇవ్వకపోవడంతో అనేక మంది ఇళ్ళ కోసం ఎదురు చూస్తున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరిట డబుల్ బెడ్ రూమ్‌లు, స్థలం ఉన్నవారికి గృహనిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని, నాలుగైదు రోజులుగా రైతు బంధు నగదు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు, తర్వాత ప్రజాసేవే మా లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్దే ప్రధాన ఆకాంక్షతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. నిజామాబాద్ పూర్వ వైభవానికి కృషి అవసరమని, జిల్లాకు కావలసిన అన్ని సదుపాయాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పేద విద్యార్థికి మనం గ్రూప్ చేయూత...

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఎంతో మంది పేద తల్లిదండ్రులు పేదరికంతో వారి పిల్లలకు నోటు పుస్తకాలు కొని ఇవ్వలేని పరిస్థితులలో ఉన్నారు. అలాంటి వారికి చేయూత అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని బీహెచ్ఈఎల్ మనం గ్రూప్ అడ్మిన్ సురేందర్ అన్నారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థికి నోటు పుస్తకాల కోసం బాధపడుతున్న ఓ తండ్రి బాధను అర్థం చేసుకుని మనం గ్రూపు ముందుకు వచ్చింది. విద్యార్థికి కావలసిన నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగ మనం గ్రూప్ అడ్మిన్ మాట్లాడుతూ ఉద్యోగులు తమకు తోచిన విదంగ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా మానవత్వంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రక్తదానం ఎంతో మంది ప్రాణాలను నిలబెడుతుంది

విశాలాంధ్ర - తుర్కయాంజాల్ : అవసరమైన సమయంలో రక్తం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితిలో రక్తదానం ఎంతో మంది ప్రాణాలను నిలబెడుతుందని తుక్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి అన్నారు. ప్రతి రోజు ఒక చర్య ఒక మార్పు అనే నినాదంతో వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మానవ సేవే మాధవ సేవగా భావించి తుర్కయాంజాల్ పురపాలక సంస్థ, సెయింట్ పాల్స్ ఫార్మసి కాలేజ్ వారు ప్రతిమ సాయి బ్లడ్ క్యాంపు వారు సంయుక్తంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పారిశుధ్య కార్మికులు, బిల్ కలెక్టర్‌లు, వార్డు సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మనం సమాజం పట్ల ఉన్న బాధ్యతను రక్తదానం ద్వారా చూపించాం ఇది ఒక మంచి ప్రారంభం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం అని అన్నారు. రక్తదాతలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు, సిబ్బందికి కమిషనర్ సెయింట్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్మయిలు అభినందనలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో 'ద ఆర్ట్ ఆఫ్ లివింగ్' ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాలో పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం 6:30 గంటలకు ప్రారంభమైన యోగాలో 350 మంది పోలీసు సిబ్బంది హాజరయ్యారు. యోగా సెషన్‌లో శ్వాస సంబంధిత వ్యాయామాలు, ధ్యానం, వివిధ ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ జాయింట్ సీపీ డా. గజరావు భూపాల్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే థీమ్‌తో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీ షమీర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్లు శ్రీనివాసన్, వెంకట్, శ్వేత, శ్రవణ్, హోంగార్డుల ఇన్‌ఛార్జ్ ఏసీపీ ఇంద్రవర్ధన్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏసీపీ అరుణ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు లవకుమార్, నాగరాజు రెడ్డి, వీరలింగం, హిమాకర్, జంగయ్య, ప్రసాంత్ బాబు తదితర పోలీసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులను పరిశీలించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ వినాయక నగర్ కాలనీలో సిసి రోడ్ల పనుల నాణ్యతను ఆదివారం ఉదయం మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులు నాణ్యతతో వేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. సీసీ రోడ్డు పనులు తరగ పూర్తి చేసి ప్రజలకు ఆ దుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అరుణ్ రెడ్డి, కాలనీ కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

విశాలాంధ్ర - అమనగల్లు: ఆమనగల్లులోని సూర్యలక్ష్మి కాటన్ మిల్ ఎదుట ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మున్సిపాలిటీ పరిధిలోని మూర్తుజపల్లికి చెందిన యువకుడు కాలే మహేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆమనగల్లు నుంచి మూర్తుజపల్లి వెళ్తుండగా లారీ కింద పడి మరణించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్యే పరామర్శ...

అమనగల్లు మున్సిపాలిటీ మూర్తుజ పల్లి గ్రామానికి చెందిన కాలే మహేందర్ (టిల్లు) కాటన్ మిల్లు ఎదుట రోడ్డు ప్రమాదంలో మరణించాడు,కల్వకుర్తి నియోజకవర్గం లో పర్యటన ముగించుకుని హైదరాబాద్ కి వెళ్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాటన్ మిల్లు వద్ద జరిగిన సంఘటన చూసి మృతదేహం వద్ద వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తక్షణ సహాయంగా రూ.5000, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిట్ట నారాయణ రూ.5000లు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

శ్రీదేవి థియేటర్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్‌లోని శ్రీదేవి థియేటర్ రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని చందానగర్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పరనంది శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీ దేవి థియేటర్ రోడ్డు ర్యాలీలో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సాయిబాబా గారు మాట్లాడుతూ "శ్రీ దేవి థియేటర్ నుండి రాజేందర్‌రెడ్డి కాలనీ వైపు వెళ్ళే రోడ్డు అస్తవ్యస్తంగా మారింది, దీనివల్ల వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు అడుగడుగునా గుంతలు ఉన్నందున ద్విచక్ర వాహనదరులు ముఖ్యంగా మహిళలు బండి అదుపు తప్పి కింద పడిపోవడం గాయల పాలవడం జరుగుతుంది. వచ్చేది వర్షాకాలం కనుక మరింత ఇబ్బందులు ఎదొరకావాల్సి వస్తుంది కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని రోడ్డు మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాహకులు పరనంది శ్రీకాంత్, మిద్దెల మల్లారెడ్డి, రవి యాదవ్, సతీష్‌రావు, వాళ్ళ హరీష్‌రావు, కిరణ్ యాదవ్, గోపరాజు శ్రీనివాస్‌రావు, రామకృష్ణ గౌడ్, ఎండీ సలీమ్, మల్లేష్ యాదవ్, దొంతి చిన్న, ఎండీ అఫ్సర్, ఉపేందర్, రవి తేజ, మనోహర్ రెడ్డి, బాబు మోహన్ మల్లేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

28న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర - బషీర్ బాగ్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 28 సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జేఏసీ కోశాధికారి చంద్రన్న ప్రసాద్ తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ నేతలతో కలసి ఆయన మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించి, గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. అలాగే 250 గజాల ఇంటి స్థలంతో పాటు నాలుగు గదుల ఇళ్ళు నిర్మించి ఇవ్వాలన్నారు. నెలకు రూ.30 వేల గౌరవ వేతనాన్ని ప్రతి నెల ఇవ్వాలన్నారు. అమరవీరుల స్మృతి వనంను 100 ఎకరాలలో ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యమకారుల, అమరుల కుటుంబాలకు ఇఎస్ఐ సౌకర్యం, ఉచిత బస్సు పాసులు అందజేయాలన్నారు. ఆర్థికంగా, మానసికంగా అన్ని రకాలుగా నష్టపోయి చేసుకునే వృత్తులు, పనులు పోయాయి కనుక వారికి 50 శాతం సబ్సిడీతో కూడిన రూ.1 కోటి వ్యాపారం నిమిత్తం ఆర్థిక సహాయం ప్రభుత్వమే నేరుగా అందించాలన్నారు. అలాగే రూ.20 లక్షల సామాన్య, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. జేఏసీ నాయకులు గోధుమల కుమారస్వామి, కుసుమ సిద్దారెడ్డి, సురుడు ప్రభాకర్, ఓవిరాల సుజ్జి, బట్టారి ఆంజనేయ స్వామి, మోహన్ బైరాగి, వేముల యాదగిరి, గడ్డం సదానందం, సర్గ మల్లయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ పంచవటి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పంచవటి కాలనీ పార్కు స్థలంలో హంసా హెూమియోపతి నెట్‌వర్క్ క్లినిక్ సౌజన్యంతో అనుభవజ్ఞులైన హెూమియోపతి వైద్యులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పంచవటి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మణిరాం నాయక్, ప్రధాన కార్యదర్శి డి. ఆంజనేయులు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, ముఖ్య సలహాదారులు మాచెర్ల ఆంజనేయులు, డి.భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు నరసింహా, రాజు, కాలనీ వాసులు, పాల్గొన్నారు.

హైమా రామ్ ట్రస్ట్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర - అమనగల్లు : గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద ప్రజలకు సహాయం చేయడం అభినందనీయ మని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల పరిధిలో పోలేపల్లి గ్రామానికి లాలయ్య ఇటీవలే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాల పాలయ్యాడు. ఈ విషయాన్ని పోలేపల్లి గ్రామ ఉప సర్పంచ్ ధారెడ్డి అంజన్ రెడ్డి, హైమా రామ్ మల్లాది ట్రస్ట్ చైర్ పర్సన్ మల్లాది శారద దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు తనవంతు సహాయంగా రూ.21 వేల రూపాయల చెక్కును ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయన చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. హైమా రామ్ ట్రస్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆకాంక్షించారు. ధారెడ్డి లక్ష్మీదేవి, కర్నాటి భగవాన్ రెడ్డి, గౌని యాదయ్య, మహేష్ ఉన్నారు.

గ్రామాల్లో కుంటుపడిన పారిశుద్ధ్యం

గ్రామ పంచాయితీల సమస్యలపై మంత్రి సీతక్కకు హరీష్‌రావు లేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా కుంటుపడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు లేఖ రాశారు. ఈ సందర్భంగా అయన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్న పెండిరగ్‌లో ఉన్న మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. పంచాయతీ నిధుల విడుదల, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ, ఇతర సమస్యల గురించి అయన లేఖలో ప్రస్తావించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధిలో భాగంగా 2019లో కె.చంద్రశేఖర్ రావు నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం 9,350 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం వారు ఎంతో శ్రమించారన్నారు. గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు మంజూరు చేయడం, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ అధికారుల కృషి వల్ల తెలంగాణ గ్రామాలు అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిస్థితులు ఇందుకు భిన్నంగా మారాయని, నిధులు విడుదల లేకపోవడంతో గ్రామ పంచాయతీల అభివృద్ధి ఎక్కడిక్కడే నిలిచిపోయి పారిశుద్ధ్యం పడకేసిందన్నారు. వీధి దీపాల నిర్వహణ లేక పల్లెలు అంధకారంలో ఉంటున్నాయని, చివరకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేక, ఆర్టీఏ టాక్స్ కట్టలేక అధికారులకు తాళాలు అప్పగిస్తున్న దుస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయిన ప్పటికీ, పంచాయతీ అధికారులు అప్పులు తెచ్చి మరీ నిర్వహణ కొనసాగించే ప్రయత్నం చేసారని అన్నారు. ఒకవైపు రోజురోజుకీ అప్పులు పెరగటం, మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం వల్ల పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం మరింత పెరిగిందన్నారు. దీంతో వారు మానసిక ఆందోళనకు గురవుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తే నిధులు విడుదల మరింత కష్టతరం అవుతుందని బాధపడుతున్నారన్నారు. మాజీ సర్పంచులు సైతం చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర ఆందోళన చెందుతున్నార న్నారు. కావున గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు చేసిన పనులకు మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండిరగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే "అభయహస్తం" మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరిం చారన్నారు. గత మూడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే వారికి వేతనాలు చెల్లించాలని కోరారు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేదని, వాటిని కూడా వెంటనే వారి వేతనాలు విడుదల చేయాలన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - జవహర్ నగర్ : ఆగస్టు 19, 22వ తేదీలలో కుత్బుల్లాపూర్‌లో జరుగనున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఆదివారం మేడ్చల్ జిల్లా కాప్రా మండల సిపిఐ సమితి సమావేశం మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జవహర్ నగర్ దళిత భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ ఆరు రోజుల పాటు నిర్వహించ నున్న పార్టీ రాష్ట్ర మహాసభల జయప్రదం చేయదానికి ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో మండల పార్టీ సభ్యత్వం, మహాసభలకు కాప్రా నుంచి హాజర్ కానున్న ప్రతినిధులు, మహాసభలకు చేయవలసిన జన సమీకరణ, నిధుల సేకరణకు సంబంధించిన విషయాలపై చర్చించారు. అనంతరం ఉమా మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు మన మేడ్చల్ జిల్లాలో నిర్వహిస్తున్న అందువలన విస్తృత ప్రచారం నిర్వహించి, భారీ ఎత్తున జన సమీకరణకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు టి.శంకర్, శంకర్‌రావు, సి.హెచ్. దశరథ్, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లత, స్వరూపలు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.జయమ్మ, కవితలు, డి.హెచ్.పి.ఎస్ కాప్రా మండల అధ్యక్షులు చిలుమూరి మల్లేష్, సహాయ కార్యదర్శి మోతే రాజేశ్వరి, సిపిఐ సీనియర్ నాయకులు నర్సింహ, ఎ.ఐ.టి.యు.సి నాయకులు ఎల్లయ్య, గిరిజన సమాఖ్య నాయకులు కొండ సత్యం, కె.కురుమయ్యలు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల జిల్లా పార్టీ కార్యదర్శిగా ఎన్నికైన ఉమామహేష్‌ను నాయకులు, కార్యకర్తలు శాలువా కప్పి సన్మానించారు.

సమాచార హక్కు చట్టం అమలుపై ప్రభుత్వానికి పారదర్శకత ఉండాలి

విశాలాంధ్ర- బషీర్‌బాగ్: సమాచార హక్కు చట్టం అమలుపై ప్రభుత్వానికి పారదర్శకత, అధికారులు జవాబుదారిగా ఉండాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో ఆ వ్యక్తికి కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. నిర్ణీత సమయంలోపు అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చ న్నారు. వీరు నుంచి స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార చట్టం చీఫ్ కమిషనర్‌కు అప్పీల్ చేసుకోవాలన్నారు. కమిషన్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటుందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిరాకరించే అధికారం ప్రభుత్వ వ్యవస్థలో ఏ శాఖ, అధికారికి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, రాష్ట్ర కన్వీనర్ కిఫ్యాయాత్ అలీ, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ దిలీప్‌రావ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపీనాథ్ కట్టికోల, రాష్ట్ర కార్యదర్శి చింతల క్రిష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వై కార్తీక్ రెడ్డి, బి లక్ష్మణ్, ఆర్ లక్ష్మణ్, వి గణేష్, వి శ్రవణ్ కుమార్, రామకృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమానికి ఎంపీ ఆర్ కృష్ణయ్య సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ సంయుక్తంగా జూలై 17న తలపెట్టిన రైల్ రోకో కార్యక్రమంతో సహా ప్రతీ కార్యక్రమానికి తాము అండగా నిలిచి పాల్గొంటామని, బీసీలంతా ఎమ్మెల్సీ కవిత ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం విద్యానగర్ లోని ఆర్ కృష్ణయ్య నివాసంలో ఆయనతో ఎమ్మెల్సీ కవిత భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కల్పించడానికి అసెంబ్లీ పాస్ చేసిన బిల్లును ఆమోదించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచడానికి చేపతుతున్న రైల్ రోకోకు మద్ధతివ్వాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ... అనేక ప్రజాస్వామిక, సామాజిక ఉద్యమాలను కృష్ణయ్య నడిపించారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు కోసం రెండు సంవత్సరాలుగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేసిన దానికి ఫలితంగా రెండు బిల్లులను అసెంబ్లీ ఆమోదించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల ప్రేమను మాటల్లో వరకే పరిమితం చేస్తూ చేతల్లో చూపించడం లేదని విమర్శిం చారు. కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని లీకులు ఇస్తున్న నేపథ్యంలో ప్రజా వ్యతిరేక విధానాన్ని కలిసికట్టుగా ఎదుర్కో వాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత బీసీలకు అండగా నిలచి ఉద్యమం చేస్తున్నారని, బీసీలంతా ఎమ్మెల్సీ కవిత ఉద్యమంలో పెద్ద ఎత్తున భాగస్వాములయ్యి మద్ధతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-తాడిపత్రి: కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు రాజకీయ పార్టీలు హింస ప్రేరణ వ్యాఖ్యలు మానుకోవాలని, రాజ్యాంగ, లౌకిక ప్రజాస్వామ్యానికి కాపాడుకోవడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. ఆదివారం పట్టణంలోని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న మాంగల్య ఫంక్షన్ హాలులో సీపీఐ పట్టణ 3వ మహాసభలు ప్రారంభమయ్యాయి. తొలుత స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి మాంగల్య ఫంక్షన్ హాలు వరకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, తాడిపత్రి నియోజకవర్గం ఇంఛార్జ్ రాజారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాల మేరకు నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి... ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, రైతులకు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆడబిడ్డల నిధి కింద ప్రతి ఇంటికి రూ. 1,500 ఇస్తామని, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారని, కానీ ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్నా ఆ హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి పల్నాడు సభకు వెళ్లినప్పుడు వైసీపీ అధికారంలోకి వస్తే రప్ప... రప్ప చంపుతామని రాయడమేమిటని ప్రశ్నించారు. దీనికి విలేకరులు అడిగిన ప్రశ్నకు జగన్‌మోహన్ రెడ్డి రప్ప... రప్ప... అని రాయడంలో తప్పేముందని అనటాన్ని, దీనిపై ఆ రెండు రాజకీయ పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలతో హింసను ప్రేరేపించేలా చేయడం అత్యంత దుర్మార్గమైన విషయమని తెలిపారు. దీంతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం అవకాశం ఉన్నందున రెండు పార్టీలు హింస ప్రేరేపిత వ్యాఖ్యలను మానుకోవాలని హితవు పలికారు. మరోవైపు, రాష్ట్రంలో 26 జిల్లాలలో ఎమ్మెల్యేలు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండి పడ్డారు. ఎమ్మెల్యేల దోపిడీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరికట్టి ప్రజలకు మంచి పరిపాలన అందించాలని హితవు పలికారు. ప్రస్తుతం సీపీఐ మండల, పట్టణ, జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, అనంతరం ఒంగోలులో ఆగస్టు 23, 24, 25 తేదీలలో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబరులో జాతీయ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తామన్నారు. పాలకుల విధానాలపై పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దవడుగూరు మండల కార్యదర్శి వెంకట రాముడు యాదవ్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు యాదవ్, వెంకట్రాముడు, నాగేంద్ర, రామాంజనేయులు, నాగార్జున, అబ్రహం పాల్గొన్నారు.

ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం దాణాపురం సర్పంచ్ కుల, మతాల గురించి ప్రస్తావించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం, దాణాపురం సభలో దళితుడైన కారణంగా సర్పంచ్‌ను వేదిక మీదకు పిలవకుండా అవమానించిన ఘటన దుర్మార్గమని పేర్కొన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఈ ఘటనపై క్షమాపణలు చెబుతూ సర్పంచ్ మతం గురించి ప్రస్తావించటం హేయతిహేయమని తప్పుపట్టారు. నాగరిక సమాజంలో బాధ్యతాయుత పదవిలో ఉండి కూడా కుల, మతాల ప్రస్తావన తెచ్చిన ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రామకృష్ణ కోరారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు
రూ.1.11 లక్షల నిధి వసూలు

జోలె పట్టిన గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలులో ఆగస్టులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య జోలె పట్టారు. సీపీఐ ప్రకాశం జిల్లా మహాసభలు దర్శి పట్టణంలో ఈ నెల 20 నుంచి జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరయిన ప్రతినిధులను రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం నిధిని దానం చేయాలని కోరుతూ ఈశ్వరయ్య జోలె పట్టారు. దీంతో స్పందించిన ప్రతినిధులు, కార్యకర్తలు తమ వద్ద ఉన్న మొత్తాన్ని రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం అందజేశారు. వారంతా నిమిషాల వ్యవధిలోనే లక్షా 11 వేల 300 రూపాయలను అందజేశారు.

తోమహాక్‌తో అమెరికా విధ్వంసం

నాడు ఇరాక్‌పై... నేడు ఇరాన్ మీదకు

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు... యుద్ధ వాతావరణానికి దారితీసింది. ఈ రెండు దేశాలు పరస్పరం తీవ్ర దాడులు చేసుకుంటున్న క్రమంలో అవి వాడుతున్న ఆయుధాలు తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఇరాన్ అణు కేంద్రాలపై దాడి విషయంలో ప్రపంచం మొత్తం బంకర్ బస్టర్ బాంబుల గురించి చర్చిస్తుంటే... ఓ క్షిపణి మాత్రం తన పని తాను చేసుకుపోయింది. అదే తోమహాక్ క్రూయిజ్ క్షిపణి. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా చాలా యుద్ధాల్లో అమెరికా అత్యధికంగా ఆధారపడిన ఆయుధాల్లో ఇది కూడా ఒకటి. ఇరాక్, సిరియా, లిబియా, గల్ఫ్, యెమెన్ యుద్ధాల్లో దీనిని అమెరికా విపరీతంగా వాడింది. ఈ క్షిపణి ప్రయోగించిన ప్రతి సందర్భంలోనూ లక్ష్యాలను విజయవంతంగా ఛేదించింది. తోమహాక్ ల్యాండ్ అటాక్ మిసైల్‌ను సముద్రంలో నౌకలు, జలాంతర్గాముల నుంచి శత్రు స్థావరాలపైకి ప్రయోగించవచ్చు. తొలిసారి 1970ల్లో ప్రచ్ఛన్న యుద్ధం వేళ దీని తయారీ తెరపైకి వచ్చింది. జనరల్ డైనమిక్స్ దీనిని అభివృద్ధి చేసింది. 1983 నాటికి అమెరికా సైన్యం చేతికి వచ్చింది. బూస్టర్ కాకుండా 5.6 మీటర్ల పొడవున్న ఈ క్షిపణి దాదాపు 1600 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. గంటకు 880 కిలోమీటర్ల వేగం (సబ్‌సోనిక్) తో ప్రయాణించగలదు. ఉపరితలానికి కేవలం 30-35 మీటర్ల ఎత్తులో ఎగిరే సామర్థ్యం ఉండటంతో ఇది చాలా దగ్గరికి వచ్చే వరకు రాడార్లు గుర్తించలేవు. సుమారు 450 కిలోల సంప్రదాయ వార్‌హెడ్‌ను అమర్చవచ్చు. అగ్రరాజ్యం వద్ద ఉన్న 140 నౌకలు, జలాంతర్గాముల్లో దీనిని ప్రయోగించే ఏర్పాట్లు ఉన్నాయంటే దీని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు.

బాగ్దాద్ యుద్ధాన్ని ప్రారంభించి

ఇరాక్‌పై డిజర్ట్‌స్టామ్ పేరిట అమెరికా చేపట్టిన యుద్ధంలో మొట్టమొదట బాగ్దాద్‌పై ప్రయోగించిన ఆయుధం ఇదే. మొత్తం 42 రోజుల పాటు జరిగిన ఈ యుద్ధంలో అమెరికా మొత్తం 297 క్షిపణులను వాడింది.

కీలక పోరాటాల్లో...

1991 మొదటి గల్ఫ్ యుద్ధంలో వందల సంఖ్యలో వాడారు. 1998లో సూడాన్, అఫ్గానిస్థాన్‌లో ఉగ్ర స్థావరాలపై చేపట్టిన ఆపరేషన్ ఇన్ఫినిటీ రీచ్‌లో ఈ క్షిపణి కీలక పాత్ర పోషించింది.

'ఫర్డో' నుంచి కీలక పరికరాల తరలింపు?

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్-ఇరాన్ పరస్పరం దాడులు చేసుకుంటున్న క్రమంలో అణు కేంద్రాలే తీవ్ర ఆందోళన కలిగించే విషయంగా ఉంది. అమెరికా దాడి చేసే సమయానికే ఫర్డో అణు కేంద్రం నుంచి కీలక పరికరాలు, యురేనియాన్ని ఇరాన్ తరలించేసినట్లు అనుమానిస్తున్నారు. జూన్ 19-20 రాత్రి ఉపగ్రహ చిత్రాల్లో ఇక్కడ భారీ సంఖ్యలో ట్రక్కులు ఇతర వాహనాలు బారులు తీరి కనిపించాయి. జూన్ 19న 16 కార్గో ట్రక్కులు అణు కేంద్రం సొరంగంలోకి ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ఇక 20వ తేదీన అక్కడికి కిలో మీటర్ దూరంలో చాలా ట్రక్కులు ఆగి ఉన్నట్లు గుర్తించారు. ఇక ప్రధాన కేంద్రంలోకి వెళ్లే మార్గంలో కొన్ని బుల్డోజర్లు కూడా కనిపించాయి. ఈ నేపథ్యంలో కచ్చితంగా దాడి జరగొచ్చనే అంచనాలతో కీలకమైన సామగ్రిని, యురేనియం నిల్వలను ఇరాన్ తరలించేసినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఫర్డో అణు ఇందన శుద్ధీకరణ కేంద్రం తెహ్రాన్ నగరానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ యురేనియం శుద్ధి చేస్తారు. ఇది నతాంజ్ కేంద్రమంత పెద్దది కాదు. ఒక పర్వతానికి అడుగు భాగాన దీనిని నిర్మించారు. వాస్తవానికి ఇది ఇరాన్‌లోని ఐఆర్‌జీసీ ఆధీనంలోని క్షిపణి కేంద్రంలో భాగం. ఈ ప్రాంతానికి అనేక విమాన విధ్వంసక బ్యాటరీలు రక్షణ కల్పిస్తున్నాయి. వైమానిక దాడులను తట్టుకొని నిలిచేలా దీన్ని రూపొందించారు. దీని నిర్మాణం 2007లో మొదలైందని ఐఏఈఏ చెబుతోంది. అమెరికా, దాని మిత్రదేశాలకు 2009 వరకు ఈ కేంద్రం ఉన్నట్టు సమాచారం లేదు. ఇక్కడ మూడు వేల వరకు ఐఆర్-1శ్రేణి సెంట్రిఫ్యూజ్‌లు ఉన్నాయి. పౌర, సైనిక అవసరాల కోసం ఇవి యురేనియాన్ని శుద్ధి చేస్తున్నాయి. రష్యాకు చెందిన ఎస్-300ను కూడా ఇక్కడ మోహరించింది. దీని లొకేషన్ ఇజ్రాయిల్‌కు తీవ్ర సవాలుగా మారింది. ఇక్కడ ప్రతి మూడు నెలలకు 60 శాతం శుద్ధి చేసిన 166 కిలోల యురేనియాన్ని ఉత్పత్తి చేసే అవకాశం ఉంది.

వేల సెంట్రిఫ్యూజ్‌లకు కేంద్రం నతాంజ్

నతాంజ్ అణు శుద్ధీకరణ కేంద్రం ఇరాన్ రాజధాని తెహ్రాన్‌కు ఆగ్నేయంగా 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. వైమానిక దాడుల నుంచి తప్పించుకునేందుకు ఈ కేంద్రాన్ని భూగర్భంలో నిర్మించారు. వేగంగా యురేనియం శుద్ధి చేసే 50 వేల వరకు అణు సెంట్రిఫ్యూజ్ యంత్రాలు ఇక్కడ ఉన్నట్లు అంచనా. యురేనియాన్ని 60 శాతం శుద్ధి చేస్తుంది. బాంబ్ గ్రేడ్‌కు ఇది చాలా దగ్గరగా ఉంటుంది. ఇస్ఫహాన్ అణు సాంకేతిక కేంద్రాన్ని చైనా సాయంతో 1984లో ప్రారంభించారు. తెహ్రాన్‌కు 350 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ 3 వేల మంది అణు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు.

అమెరికా బీ-2 బాంబర్ ప్రత్యేకత ఏమిటి?

న్యూఢిల్లీ: ఇరాన్-ఇజ్రాయిల్ క్షిపణులతో దాడులు చేసుకుంటున్నాయి. అయితే అమెరికా జోక్యంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా ఫోర్డో, నాటాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై దాడులకు బీ-2 స్టెల్త్ బాంబర్‌ను వినియోగించింది. ఫోర్డోలోని భూగర్భ అణు స్థావరాన్ని ధ్వంసం చేసేందుకు ఆరు బంకర్ బస్టర్ బాంబులను వాడినట్లు వెల్లడించింది. నతాంజ్, ఇస్ఫహాన్‌పై 30 తోమహాక్ క్షిపణులను ప్రయోగించినట్టు తెలిపింది. అమెరికా వాయుసేనకు చెందిన బీ-2 స్టెల్త్ బాంబర్ ఒక ప్రత్యేకతలు కలిగిన యుద్ధ విమానం. 1989లో తొలిసారిగా అమెరికా ఈ బాంబర్‌ను వాడింది. మూడు దశాబ్దాలుగా అమెరికా స్టెల్త్ సాంకేతికతకు ప్రతీకగా నిలుస్తోంది. శత్రు దేశాల రాడార్లకు కనిపించకుండా దాడులు చేయడం దీని ప్రత్యేకత. ఇప్పటికీ ప్రపంచంలోని అత్యంత సురక్షితమైన విమానాల్లో ఇది ఒకటిగా ఉండటం విశేషం. నార్త్రప్ గ్రమ్మన్ అనే అమెరికా సంస్థ దీన్ని అభివృద్ధి చేసింది. ఇది భూగర్భంలో ఉన్న స్థావరాలను సైతం విజయవంతంగా ధ్వంసం చేసే సామర్థ్యం ఉంటుంది. దీనికి చాలా తక్కువ రాడార్ సిగ్నల్ ఉంటుంది. చిన్న పక్షి మాదిరిగా కనిపిస్తుంది. 6 వేల నాటికల్ మైల్స్ దూరం ప్రయాణించడంతో పాటు శక్తివంతమైన ఆయుధాలను మూసుకెళ్లగల సత్తా దీనికి ఉన్నది.

ఆయుధాలను మోసుకెళ్లగలదు. ఇరాన్ విషయంలో అమెరికా ప్రత్యేకంగా భూగర్భ స్థావరాల కోసం రూపొందించిన 30 వేల పౌండ్ల మాసివ్ ఓర్డినెన్స్ పెనెట్రేటర్ (బంకర్ బస్టర్ బాంబులు) బీ-2 బాంబర్ ద్వారా ప్రయోగించింది. బంకర్ బస్టర్లు భూగర్భంలో ఉన్న గుహలను, రహస్య స్థావరాలను లక్ష్యంగా చేసుకునే శక్తివంతమైన బాంబులు. ఇవి జీపీఎస్ ఆధారంగా పని చేస్తాయి. అధిక భద్రత కలిగిన ప్రాంతాల్లోనూ వీటిని ఉపయోగించి కచ్చితంగా దాడి చేయొచ్చు.

నెతన్యాహు నడ్డి విరవడమే మార్గం

ఆర్వీ రామారావ్

ఇరాన్ మీద అమెరికా ప్రత్యక్షంగా దాడి చేసి మూడు అణు స్థావరాలను ధ్వంసం చేసిన తరవాత భవిష్యత్తులో ఇరాన్ ఎలాంటి వైఖరి అనుసరిస్తుంది అన్నది పెద్ద ప్రశ్న. ఇరాన్‌లోని ఫర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణు స్థావరాలపై అగ్ని వర్షం కురిపించిన అమెరికా 'ఇది శాంతి నెలకొనడానికి అనువైన సమయం' అని చెప్పడం మరో వైపరీత్యం. కాదు కాదంటూనే తమకు అత్యంత ఆప్త దేశమైన ఇజ్రాయిల్ తరఫున అమెరికా యుద్ధ రంగంలోకి దూకింది. ఇరాన్‌లోని అణు స్థావరాలను ధ్వంసం చేసిన అమెరికా వైమానిక దళంపై ట్రంప్ పొగడ్తల వర్షం కురిపించడంతో పాటు 'ఇది అమెరికాకే కాక మొత్తం ప్రపంచానికే చరిత్రాత్మకమైంది. ఇక ఇరాన్ యుద్ధ విరమణకు సిద్ధం కావాలి' అని గొప్పలు చెప్పుకున్నారు. అంటే యుద్ధానికి కారణం ఇరానేనని ఆయన అంతర్యం. అసలు యుద్ధం ప్రారంభించింది ఇజ్రాయిల్ అయినప్పుడు ఇరాన్‌ను యుద్ధం నిలిపివేయాలని కోరడం విచిత్రాల్లోకెల్లా విచిత్రం. ట్రంప్ ఇజ్రాయిల్ పక్షాన యుద్ధానికి దిగారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తమ గగనతలంలోకి చొరబడి అణు స్థావరాలను ధ్వంసం చేసిన అమెరికాను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధంగా ఉంది. ఇరాన్ భవిష్యత్తులో ఏం చేయబోతోంది లేదా ఏం చేయడానికి అవకాశం ఉందన్నది చర్చనీయాంశమే. ఇరాన్ అణ్వస్త్రాలు తయారు చేస్తోందని, అందుకు అవకాశం ఎంత మాత్రం ఇవ్వకూడదని అమెరికా, ఇజ్రాయిల్ అభిప్రాయం. అమెరికాకు లంకెగా ఉన్న ఇతర పశ్చిమ దేశాలు చాలా కాలంగా ఇదే వాదన వినిపిస్తున్నాయి. ఇరాన్ నడవడిక అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధం అని వితండవాదం చేస్తున్నాయి.

ఇరాన్‌లో ఆయాతుల్లా ఖామేనీ అధినేతగా ఉన్న ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఇజ్రాయిల్ అంటోంది. మరోవైపు తమకు ఆ ఉద్దేశం లేదని అమెరికా చెప్తోంది. కానీ 1979లో పదవీచ్యుతుడైన ఇరాన్ రాజు షా మహమ్మద్ రెజా పెహ్లవీ కుమారుడు రెజా పెహల్విని అధికారంలోకి తీసుకు వస్తే, తమకు కీలుబొమ్మగా వ్యవహరిస్తాడన్నది ఇజ్రాయిల్ ఆకాంక్ష. ప్రస్తుతం ఆయన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఉదారవాద ప్రజాస్వామ్యం నెలకొనాలని కోరుకుంటున్నారట. షా మహమ్మద్ రెజా పెహ్లవీని 1979లో గద్దె దించడంలోనూ అమెరికా పాత్ర ఉంది. ఇజ్రాయిల్, ఇరాన్ ఘర్షణలో తాము ఎలాంటి వైఖరి అనుసరించాలో నిర్ణయించుకోవడానికి పదిహేను రోజుల సమయం పడుతుందని ట్రంప్ ప్రకటించారు. ఆ గడువు తీరక ముందే ఆదివారం ఇరాన్ మీద ప్రత్యక్ష దాడికి దిగారు. ఇంత బాహాటంగా అబద్ధాలు చెప్పే అధ్యక్షులు ఎవరూ అమెరికా చరిత్రలో కనిపించరు. ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీని జెనీవా పిలిపించారు. జెనీవా వెళ్లక ముందే ఆయనను అంతం చేయాలనుకున్నారు. కానీ ప్రాణాలతో బయట పడగలిగారు. అరాగ్చీ జెనీవా వెళ్లారు. పశ్చిమ దేశాలతో సంప్రదిస్తుండగానే ఇరాన్‌పై అమెరికా విరుచుకుపడింది. అమెరికా మొదటి నుంచి తమ మీద కుట్ర చేస్తోంది కనక దాడికి దిగడంలో ఆశ్చర్యం లేదని ఖామేనీ వ్యాఖ్యానించారు. అమెరికా బాంబు దాడుల వల్ల ఇరాన్‌కు భారీ నష్టం ఏమీ కలగలేదంటున్నారు. పైగా ఆ స్థావరాలలో ఉన్న సామాగ్రిని ఇరాన్ మార్చిలోనే తరలించింది. అమెరికా బాంబు దాడులు చేసిన తరవాత కూడా ఇజ్రాయిల్‌లోని హైఫా, టెల్ అవీవ్ నగరాలపై ఇరాన్ క్షిపణులతో దాడి చేసింది. ఈ రెండు నగరాలకు భారీ నష్టం కలిగించింది. దీన్ని బట్టి ఇరాన్ ఆత్మస్థైర్యం కోల్పోలేదని రుజువవుతోంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సభ్యత్వం ఉన్న అమెరికానే సకల నియమాలను ఉల్లంఘించి దాడి చేసినప్పుడు... ఆత్మరక్షణ కోసం తాము ఎంతకైనా తెగించాలన్న ధోరణిలో ఇరాన్ ఉంది. ఇరాన్ ఏ వైఖరి అనుసరిస్తోందన్నదే ప్రధానం. ఇజ్రాయిల్ మీద దాడి తీవ్రం చేయడం లేదా పశ్చిమాసియాలో ఉన్న అమెరికా సైనిక స్థావరాల మీద దాడి చేయడం. కానీ అమెరికా మీద దాడి చేయకుండా జరిగిన ఘాతుకాన్ని ఉపేక్షించడమే ఇరాన్‌కు ప్రయోజనకరం. ఐక్య రాజ్య సమితి నిబంధనల మేరకు ఆత్మరక్షణ కోసం ప్రతీకార దాడులు చేయడానికి ఇరాన్‌కు వీలుంటుంది. బహ్రెయిన్ లాంటి చోట్ల ఉన్న అమెరికా స్థావరాల మీద ఇరాన్ దాడి చేస్తే యుద్ధం ఇతర ప్రాంతాలకూ విస్తరించే అవకాశం ఉంది. అవసరమైతే ఇరాన్‌కు అణ్వస్త్రాలు అందజేయడానికి కొన్ని దేశాలు సిద్ధంగా ఉన్నాయి. అమెరికా స్థావరాల మీద దాడి కన్నా ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూ నడ్డి విరవడమే ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. హర్మూజ్ జల సంధిని మూసేయడం మరో మార్గం. ఎర్ర సముద్రంలో ఉన్న అమెరికా యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హౌతీలు ఇప్పటికే ప్రకటించారు. హర్మూజ్ జల సంధిని మూసేయడానికి ఇరాన్ పార్లమెంటు ఆమోదం తెలిపింది. అదే జరిగి ఇరాన్ నుంచి చమురు సరఫరా ఆగిపోతే ప్రపంచంలోని 20 శాతం దేశాలు, ఆసియాలోని 60 శాతం దేశాలు ఇబ్బంది పడవలసి వస్తుంది. కాబట్టి ఆ దేశాలు ఇజ్రాయిల్ మీద ఒత్తిడి చేయగలిగితే అది ఇరాన్‌కే ఉపయోగపడుతుంది. ఇజ్రాయిల్ దూకుడుకు కళ్లెం పడక తప్పదు.

తొందరపడో, భయపడో యుద్ధం ఆపేస్తే ఇరాన్ అస్తిత్వానికే నష్టం. కాల్పుల విరమణను ఇజ్రాయిల్ ఏ మేరకు పాటిస్తుందో గాజా, పలస్తీనా పరిస్థితులతో స్పష్టమవుతోంది. ఇజ్రాయిల్ దగ్గర అణ్వస్త్రాలు ఉన్నప్పుడు ఇరాన్ దగ్గర ఉంటే నష్టం ఏమిటి అని సోవియట్ పతనం తరవాత రష్యా మూడో ప్రధానిగా పని చేసిన దిమిత్రీ మెద్వదేవ్ అడగడం కూడా తప్పని సరిగా అడగవలసిన ప్రశ్నే. ప్రస్తుతానికి ఇరాన్ దగ్గర అణ్వస్త్రాలు లేవు కనకే అమ్రికా దొంగ దెబ్బ తీయడానికి ప్రయత్నించింది. అణ్వస్త్రాలున్న ఉత్తర కొరియా జోలికి అమెరికా వెళ్లకపోవడానికి ప్రధాన కారణం ఉత్రర కొరియా దగ్గర అణ్వస్త్రాలు ఉండటమేనని గుర్తుంచుకోవాలి. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ఏ మాత్రం లొంగుబాటు ధోరణి ప్రదర్శించినా మొదటికే మోసం వస్తుంది. ఇరాన్ మెతక వైఖరి అనుసరిస్తే దన్నుగా నిలిచే దేశాలు కూడా ఆత్మస్థైర్యం కోల్పోతాయి. అమెరికా గూండాగిరిని నిరోధించాలంటే నెతన్యాహు నడ్డి విరవడమే ఇరాన్‌కు ఉన్న మార్గం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.